ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 72

బుధవారం 14 ఆగస్టు 2024 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## వినేశ్ పిటిషన్‌పై తీర్పు మళ్లీ వాయిదా

ఈనెల 16న నిర్ణయం



.. వివరాలు 7లో



# ఏసీబీ వలలో అదనపు కలెక్టర్

నిషేధిత జాబితా నుంచి 14 గుంటల భూమి తొలగించేందుకు 8 లక్షల డిమాండ్

డబ్బు తీసుకోవాల్సిందిగా సీనియర్ అసిస్టెంట్‌ను పురమాయించిన భూపాల్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ నిర్వాకం..

రెడ్‌హ్యాండెడ్‌గా అసిస్టెంట్ పట్టివేత

ఆపై అదనపు కలెక్టర్‌నూ చాకచక్యంగా పట్టుకున్న ఏసీబీ అధికారులు

ఆయన నివాసంలో సోదాలు.. రూ.16 లక్షలు, ఆస్తి పత్రాల జప్తు?

రంగారెడ్డి ఆగస్టు 13 : నిషేధిత జాబితా నుంచి భూమిని తొలగించేందుకు లంచం తీసుకుంటుండగా రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి దొరికిపోయారు. లంచం డబ్బులు తీసుకోవాలంటూ జూనియర్ అధికారిని పురమాయించడం ద్వారా ఆ అధికారి అత్యంత చాకచక్యంగా వ్యవహరిస్తే.. ఏసీబీ అధికారులు అంతకుమించి చాకచక్యంగా వ్యవహరించి ఆయన్ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మేరకు

మిగతా 2 లో

# గురుకులాల ప్రక్షాళన

## ప్రతి నెలా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

ఏ విద్యార్థీ నేలపై పడుకోవడానికి వీల్లేదు

మంత్రులు, ఎమ్మెల్యేలు నెలకో రోజు సందర్శించాలి: డిప్యూటీ సీఎం భట్టి

ప్రతి నెలా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

గురుకులాలపై గత సర్కారు నిర్లక్ష్యం

ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు, కళాశాలలను ప్రక్షాళన చేస్తామని, అభివృద్ధికి నిధులు సమకూరుస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. 2004 నుంచి 2014 వరకు హాస్టళ్లలో చదివే విద్యార్థులకు హెల్త్ కార్డులు ఉండేవని, ప్రతి నెలా వైద్యులు వచ్చి వారి ఆరోగ్యాన్ని పరీక్షించి, కార్డులో రాసే వారని గుర్తుచేశారు. ప్రభుత్వ హాస్టళ్లలోనే పారా మెడికల్ సిబ్బంది ఉండేవారని, ఆ విధానాన్ని తిరిగి తీసుకొస్తామన్నారు. గురుకుల పాఠశాలలో చదివే ఏ విద్యార్థీ నేలపై పడుకోవడానికి వీల్లేదని, మంచం, పరుపు, దుప్పటిని ప్రభుత్వం సమకూరుస్తుందన్నారు.



జగిత్యాల, ఆగస్టు 13 : మంగళవారం భట్టి జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఇటీవల మృతిచెందిన ఇద్దరు విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ఓదార్చారు. తరగతి గదులు, డార్మెటరీ, ఆవరణను పరిశీలించారు. పలువురు తల్లిదండ్రులు ఇచ్చిన వినతి పత్రాలను స్వీకరించారు. విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. పెద్దాపూర్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మృతిచెందడం దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. విదేశీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పెద్దాపూర్ పాఠశాలకు వచ్చానన్నారు. ఇకపై నెలలో ఒక రోజు మంత్రులు, ఎమ్మెల్యేలు

మిగతా 2 లో



# పేదల సొంతింటి కలను సాకారం చేద్దాం

గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లకోసం అర్హులైన.. పేదల జాబితాను కేంద్రానికి పంపండి

సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ

2018 సర్వేలో నాటి ప్రభుత్వం భాగస్వామి కాలేదు

పేదలకు కేంద్ర సాయం అందకుండా చేశారు

న్యూఢిల్లీ ఆగస్టు 13 : తెలంగాణలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో సొంతిల్లు అవసరం ఉన్న పేద కుటుంబాల జాబితాను వీలైనంత త్వరగా తయారుచేసి కేంద్రానికి పంపించాలని సూచించారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కిషన్‌రెడ్డి లేఖ రాశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికీ సొంతింటిని నిర్మించాలనే సంకల్పంతో 2016లో

మిగతా 2 లో

# ప్రతిష్టాత్మకంగా రీజినల్ రింగ్ రోడ్డు

## త్వరితగతిన భూసేకరణ చేపట్టాలి

## కలెక్టర్లను ఆదేశించిన సిఎస్ శాంతి కుమారి

హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యత నిచ్చి, సెప్టెంబర్ రెండవ వారంలోగా ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణ పూర్తిచేయాలని సంబందిత జిల్లా కలెక్టర్‌లను ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణ పనుల పురోగతిపై మంగళవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

హైదరాబాద్,ఆగస్ట్ 13 : ఈ సమీక్షా సమావేశానికి రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారులు శ్రీనివాస్ రాజు, రెవిన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవిన్ మిట్టల్, అటవీ శాఖ అడిషనల్ సెక్రటరీ ప్రశాంతి, ప్రత్యేక కార్యదర్శి హరిచందన, సంయుక్త

మిగతా 2 లో





# మంత్రి తుమ్మల మనస్తాపం

ప్రజల కోసం పని చేస్తా.. పబ్లిసిటీ కోసం కాదు

'సీతారామ' ప్రారంభానికి మీరూ రండి

ప్రజాస్వామ్యంలో నీది నాది ఏదీ లేదు.. అంతా ప్రజలదే

మీ తప్పిదాలను మాకు అంటగట్టొద్దు: తుమ్మల

రేపు సీఎం చేతుల మీదుగా 3 పంప్‌హౌసలు..

ఖమ్మం, ఆగస్టు 13 : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కంటతడి పెట్టారు. బీఆర్ఎస్ హయాంలో పూర్తయిన సీతారామ ప్రాజెక్టుకు.. ఇప్పుడు రిబ్బన్ కట్ చేసేందుకు కాంగ్రెస్ నేతలు ఉవ్విళ్లూరుతున్నారంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలతో తుమ్మల మనస్తాపానికి గురయ్యారు. ప్రజాస్వామ్యంలో నీది.. నాది అంటూ ఏదీ ఉండదని, అంతా

మిగతా 2 లో

# బాన్సువాడలో ఉప ఎన్నిక ఖాయం

పోచారం శ్రీనివాసరెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారు

బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కేటీఆర్

గురుకులాల సమస్యలపై ప్రభుత్వం స్పందించడం సంతోషమేనని వ్యాఖ్య

హైదరాబాద్, ఆగస్టు13 : బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక రావడం ఖాయమని, పార్టీ మారిన పోచారం శ్రీనివాసరెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఆయనను కలిశారు. ఈసందర్భంగా కేటీఆర్

మిగతా 2 లో





# 40% మందికి రుణాలు మాఫీ కాలేదు!

రూ.2 లక్షలు ఒకే సారి మాఫీ చేస్తామని ఇప్పటికీ చేయలే

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శలు

రైతు సమస్యలపై రచ్చబండ నిర్వహిస్తామని వెల్లడి

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

హనుమకొండ టౌన్, ఆగస్టు 13: రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ కాలేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఊళ్లలో 40 శాతం మంది

మిగతా 2 లో



# ఏసీబీ వలలో అదనపు కలెక్టర్

**మొదటి పేజీ తరువాయి**

భూపాల్‌రెడ్డితో పాటు కలెక్టరేట్ ఈ-సెక్షన్ అధికారి మదన్ మోహన్‌రెడ్డి కూడా పట్టుబడ్డారు. హైదరాబాద్ నగర శివార్లలోని గుర్రంగూడకు చెందిన జక్కిడి ముత్యంరెడ్డికి చెందిన 14 గుంటల భూమి ధరణిలో నిషేధిత జాబితాలో ఉంది. దీన్ని ఆ జాబితా నుంచి తొలగించాలంటూ పలుమార్లు రెవెన్యూ అధికారులకు ముత్యంరెడ్డి వినతి పత్రం ఇచ్చాడు. పని అవ్వకపోవడంతో ముత్యంరెడ్డి ఈ-సెక్షన్ అధికారి మదన్ మోహన్‌రెడ్డిని కలవగా ఆయన పెద్ద మొత్తంలో లంచం డిమాండ్ చేశారు. చివరకు రూ. 8 లక్షలకు ఒప్పందం కుదిరింది. అయితే ఈ లంచం వ్యవహారం గురించి ముత్యంరెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సోమవారం రాత్రి మదన్ మోహన్‌ను ముత్యంరెడ్డి కలిసి ఆ డబ్బు ఇచ్చారు.

అప్పటికే అక్కడ మాటు వేసిన ఏసీబీ అధికారులు.. మదన్ మోహన్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి చెబితేనే తాను డబ్బులు తీసుకున్నట్లు ఏసీబీ అధికారులకు మదన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. దీన్ని ధ్రువీకరించుకునేందుకు తమ ముందే అదనపు కలెక్టర్‌కు ఫోన్ చేయాలంటూ ఏసీబీ అధికారులు ఆయన్ను ఆదేశించారు.

%మదన్‌మెహన్ వెంటనే భూపాల్‌రెడ్డికి తన ఫోన్ నుంచి కాల్ చేశారు. గుర్రంగూడ భూమికి సంబంధించిన విషయంలో డబ్బు చేతికి అందిందని చెప్పగానే ఆ డబ్బు తీసుకుని పెద్ద అంబర్‌పేట్ ఓఆర్ఆర్ వద్దకు రావాలని భూపాల్‌రెడ్డి సూచించారు. వెంటనే అధికారులు అప్రమత్తమయ్యారు. మదన్‌మోహన్‌ను కారులో డబ్బుతో వెళ్లాలని ఆదేశించి.. ఆ వాహనాన్ని తమ కారులో అనుసరించారు. చెప్పిన చోటుకు వెళ్లి, అక్కడ రూ.8 లక్షలు అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి మదన్‌మోహన్ ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

అక్కడి నుంచి భూపాల్‌రెడ్డి, మదన్‌మోహన్‌ను అర్ధరాత్రి కలెక్టరేట్‌కు తరలించారు. కాగా బాధితుడు ముత్యంరెడ్డి గతంలోనూ ఐదుగురు అధికారులను ఏసీబీకి పట్టించడం గమనార్హం.

ఏబీసీ అధికారులు సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం 10:30 వరకు కలెక్టరేట్‌లో రికార్డులను పరిశీలించారు. తట్టిఅన్నారం ఇందు అరణ్య హరితలోని అదనపు కలెక్టర్ విల్లాలో అధికారుల బృందం సోదాలు చేపట్టింది. ఈ మేరకు రూ.16 లక్షల నగదు, స్థిరాస్తుల పత్రాలను స్వాధీనం చేసున్నట్లు సమాచారం. అనంతరం భూపాల్‌రెడ్డి, మదన్‌మోన్ ను అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టుకు తరలించారు.



**గతంలో మంత్రి ఓఎస్డీగా భూపాల్‌రెడ్డి**

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఏసీబీకి చిక్కిన భూపాల్‌రెడ్డి గతంలో మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి వద్ద ఓఎస్డీగా చేశారు. తరువాత భువనగిరి డివిజన్ పరిధిలోని బీబీనగర్, బొమ్మలరామారం, చౌటుప్పల్, యాదగిరిగుట్టలో తహసీల్దార్‌గా చేశారు. అనంతరం భువనగిరి ఆర్డీవోగా పనిచేశారు. అంతకు ముందు ఆయన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌గా, అనంతరం కలెక్టరేట్‌లో సెక్షన్ అధికారిగా విధులు నిర్వర్తించారు. ఈ సమయంలో గతంలోనూ ఆయన అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ-సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డి షాద్‌నగర్‌లో వీఆర్వోగా పనిచేశారు.

# బాన్సువాడలో ఉప ఎన్నిక ఖాయం

**మొదటి పేజీ తరువాయి**

మాట్లాడుతూ.. కార్యకర్తల కష్టంపై గెలిచి స్వార్థం కోసం పోచారం పార్టీ వీడటం కార్యకర్తలను బాధించిందని,. కష్టకాలంలో పార్టీకి ద్రోహం చేస్తే ఎంత పెద్దవారైనా వదిలిపెట్టేది లేదన్నారు. కాంగ్రెసలో చేరిన పోచారంను ఎవరూ పట్టించుకోవడం లేదని, ఆయన పార్టీ వీడినా.. అక్కడి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మాత్రం పార్టీ మారలేదన్నారు. బాన్సువాడ ఉప ఎన్నికలో పోచారం శ్రీనివాసరెడ్డిని ఓడిస్తామని చెప్పారు. కాగా, ఇప్పటివరకు మొద్దునిద్రపోయిన కాంగ్రెస్ సర్కారు ఇప్పటికైనా గురుకులాల సమస్యలపై స్పందించడమే సంతోషమేనని, కనీస సౌకర్యాలు కల్పించి విద్యార్థుల బాధలు తీర్చాలని కేటీఆర్ పేర్కొన్నారు. కలుషిత ఆహారం కారణంగా 500 మందికి పైగా విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారని, గురుకులాల్లో నాణ్యమైన భోజనం అందించేలా చూడాలన్నారు.

**గురుకులాల్లో మిగిలిన పోస్టులను భర్తీ చేయాలి**

గురుకులాల్లో చేపట్టిన నియామకాల్లో భర్తీ కాకుండా మిగిలిపోయిన పోస్టులను మెరిట్ జాబితాలోని తదుపరి అభ్యర్థులతో భర్తీ చేయాలని కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురుకుల అభ్యర్థులు పలువురు మంగళవారం నందినగర్‌లో కేటీఆర్‌ను కలిశారు. గురుకులాల్లో భారీగా ఏర్పడే ఖాళీలను నిరుద్యోగులు నష్టపోకుండా తదుపరి మెరిట్ ఉన్నవారిని ఎంపిక చేయాల్సిన అవసరం ఉందని గురుకుల అభ్యర్థులు తెలిపారు. దీనిపై స్పందించిన కేటీఆర్ గురుకులాల్లో భర్తీ కాకుండా మిగిలిపోయే పోస్టుల్లో తదుపరి మెరిట్ అభ్యర్థులకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించేలా ప్రతిపక్ష పార్టీగా నిరుద్యోగుల తరఫున పోరాటం చేస్తామని వెల్లడించారు.

**40% మందికి రుణాలు మాఫీ కాలేదు!**

రైతులకు రుణమాఫీ జరగలేదని చెప్పారు. మంగళవారం హనుమకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 64 లక్షల మంది రైతులు రుణాలు తీసుకోగా.. వారిలో 49 లక్షల మందే రుణమాఫీకి అర్హులని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. అలాగే రూ.2 లక్షల రుణమాఫీని ఒకేసారి చేస్తానని చెప్పి ఇప్పటికీ చేయలేదని ఆరోపించారు.

రెండు విడతల్లో సుమారు 18 లక్షల మంది రైతులకు రూ.12 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారన్నారు. మూడో విడతలో ఇంకో 4 లక్షల మందికి మరో 3-4 వేల కోట్ల రుణమాఫీ మాత్రమే చేస్తారని, అందరికీ చేయరని చెప్పారు. సోనియాగాంధీ జన్మదినం డిసెంబరు 9లోపు రుణాలకే వడ్డీ చెల్లిస్తామని, తదుపరి కాలానికి రైతులే చెల్లించాలనడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. రైతుల సమస్యపై బీజేపీ ఆధ్వర్యంలో గ్రామాల్లో రచ్చబండ ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తామని ఈటల చెప్పారు. సమస్యలన్నీ తెలుసుకున్నాక రైతు ఉద్యమాన్ని లేవనెత్తి ప్రభుత్వం మెడలు వంచుతామన్నారు.

# విజయవాడలో పంద్రాగస్ట్ వేడుకలు

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల రిహార్సల్స్

## ఫుల్ డ్రెస్ సన్నద్ధతను పరిశీలించిన అధికారులు

విజయవాడ,ఆగస్ట్ 13 : విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 15న రాష్ట్రస్థాయి స్వాతంత్య దినోత్సవ వేడుకలు జరగనున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల సమక్షంలో మంగళవారం నిర్వహించిన ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ విజయవంతమయ్యాయి. రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ (పొలిటికల్) ఎస్.సురేష్ కుమార్.. ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.సృజన, ఏపీఎస్‌పీ డీఐజీ బి.రాజకుమారి, ఎన్‌టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర, విజయవాడ ఆర్‌డీవో బీహెచ్ భవానీ శంకర్ తదితరులతో కలిసి రిహార్సల్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. స్వాతంత్య దినోత్సవ వేడుకలకు గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. త్రివర్ణ శోభిత వేడుకలకు సంబంధించి అడిషనల్ డీజీపీ (ఎఫ్ఏసీ), ఏపీఎస్‌పీ బెటాలియన్స్, ఐజీపీ (శాంతిభద్రతలు) సీహెచ్ శ్రీకాంత్ నోడల్ అధికారిగా, ఎన్‌టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖర బాబు పోలీస్ సమన్వయ అధికారిగా, ప్రోటోకాల్ డైరెక్టర్ ఎం.బాలసుబ్రమణ్యం రాష్ట్ర సమన్వయ అధికారిగా వ్యవహరిస్తారు. ఏఎస్ఆర్ జిల్లా అడిషనల్ ఎస్‌పీ కె.ధీరజ్ పరేడ్ కమాండర్‌గా, ఏపీఎస్‌పీ 14వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పీవీ హనుమంతు పరేడ్ సెకండ్-ఇన్-కమాండ్‌గా, పరేడ్ అడ్జుటెంట్‌గా ఏపీఎస్‌పీ 3వ బెటాలియన్ ఆర్ఐ టి.ప్రభాకర్‌రావు వ్యవహరించనున్నారు. స్వాతంత్య దినోత్సవ వేడుకల కవాతులో తెలంగాణ స్టేట్ పోలీస్, ఏపీఎస్‌పీ రెండో బెటాలియన్ (కర్నూలు), ఏపీఎస్‌పీ మూడో బెటాలియన్ (కాకినాడ), ఏపీఎస్‌పీ 11వ బెటాలియన్ (కడప), ఏపీఎస్‌పీ 16వ బెటాలియన్ (విశాఖపట్నం), ఎన్‌సీసీ బాలురు, ఎన్‌సీసీ బాలికలు, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏపీ రెడ్‌క్రాస్ సొసైటీ, ఏపీ సైనికల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ బృందాలు పాల్గొననున్నాయి.

# మంత్రి తుమ్మల మనస్తాపం

**మొదటి పేజీ తరువాయి**

ప్రజల కష్టం, రక్తం, చెమటతో కట్టే పన్నులతోనే పనులు చేస్తాం తప్ప.. సొంత డబ్బుతో ఎవరూ పనిచేయరని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలు పరిష్కరించే బాధ్యత అధికారంలో ఉండే ప్రభుత్వానికే ఉంటుందనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఇది తెలుసుకోకుండా హరీశ్‌రావు తనపై విమర్శలు చేయడం తగదన్నారు. మంగళవారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి తుమ్మల విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే మంత్రిగా ఉన్నానే తప్ప.. పబ్లిసిటీ కోసం పనిచేసేవాడిని కాదు. చీప్ పబ్లిసిటీలు నాకు అవసరం లేదు. ప్రజల సమస్యలు సత్వరం పరిష్కరించడమే నా లక్ష్యం" అని అన్నారు. ఈ నెల 15న జరిగే సీతారామ ఎత్తిపోతల స్విచ్చాన్ కార్యక్రమానికి బీఆర్ఎస్ వాళ్లు కూడా రావచ్చునని సూచించారు. "వైరా సభలో.. మీ ప్రభుత్వంలో మీరు సీతారామ ప్రాజెక్టును ఎలా వదిలేశారో చెప్పుకొనేందుకు అవకాశం కల్పిస్తాం" అని తుమ్మల వ్యాఖ్యానించారు.

8 వేల కోట్లు ఖర్చుపెట్టి అసంపూర్తిగా వదిలేశారు..

గత ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టుకు రూ.8 వేల కోట్లు ఖర్చుపెట్టి ఒక్క ఎకరానికి కూడా నీళ్లివ్వకుండా అసంపూర్తిగా వదిలేసిందని మంత్రి తుమ్మల చెప్పారు. కనీసం ఉన్న వనరులతోనైనా సాధ్యమైనంత వరకు నీరందించాలన్న ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను కృష్ణా ఆయకట్టుకు తరలించి.. వైరా, లంకసాగర్ పరిధిలో లక్షా 25 వేల ఎకరాలకు ఈ ఏడాది నీరివ్వవచ్చని ఒప్పించానన్నారు. ముఖ్యమంత్రి రూ.90 కోట్లు మంజూరు చేయడంతో రెండు నెలల్లో పనులు పూర్తిచేయించి, కాలువలు తవ్వించి నీళ్లు వదలబోతున్నామని చెప్పారు. "గత ప్రభుత్వ హ యాంలో మొదటి ఐదేళ్లలో సీతారామ ప్రాజెక్టు పనులు చేపట్టి.. అక్కడక్కడా కాలవలు తవ్వి.. మూడు పంపుహౌజ్‌లకు మోటార్లు పెట్టి వదిలేశారు.

ఆ తర్వాత ఐదేళ్లలో ఈ పనులను పట్టించుకోకుండా డిజైన్ మార్చి అస్తవ్యస్తం చేశారు. అయినా రూ.8 వేల కోట్లు ఖర్చుపెట్టారు. ప్రజల సొమ్ము వృథా కాకూడదనే మేం సత్వరం ఎత్తిపోతలు పూర్తి చేయాలని భావించాం. ట్రయల్‌రన్ నిర్వహించకపోతే మోటార్లు పనిచేయవనే ఉద్దేశంతో వాటిని వినియోగంలోకి తెచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తుంటే తప్పుడు విమర్శలు చేయడం హరీశ్‌రావుకు తగదు" అని తుమ్మల అన్నారు.

**నేను స్విచాన్ చేయలేదు..**

మొదటి పంపుహౌజ్‌కు తాను స్విచాన్ చేయలేదని, నీటిపారుదల శాఖ నిపుణుడు పెంటారెడ్డితో చేయించానని మంత్రి తుమ్మల తెలిపారు. ఒక మనిషిలా గోదావరి జలాలను తలపై చల్లుకున్నానని చెప్పారు. తన రాజకీయ జీవిత లక్ష్యం ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు గోదావరి జలాలను అందించడమేనని, అంతేతప్ప.. ఫ్లెక్సీల కోసం, ప్రకటనల కోసం, స్వార్థం కోసం ఏనాడూ ఏ పనీ చేయలేదన్నారు.

40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కువకాలం మంత్రిగా పనిచేసే అవకాశం తనకు లభించిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంతోపాటు తెలంగాణ రాష్ట్రంలోనూ మంత్రిగా.. అప్పటి ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, ఎన్టీఆర్, వైఎసఆర్, చంద్రబాబు చేసిన అభివృద్ధి పనులు ఎక్కడైనా మిగిలిపోతే వాటిని పూర్తిచేశానే తప్ప.. గత ప్రభుత్వాలు చేశాయని వివక్ష చూపించలేదన్నారు.

ప్రజాభిమానం ఉంటేనే గద్దెపై ఉంటామన్న విషయం గుర్తుంచుకోవాలని, బీఆర్ఎస్ నేతల్లో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి బాధ ఇంకా కనిపిస్తోందని అన్నారు. వారి పాలనలో తప్పిదాలను తమ ప్రభుత్వానికి అంటగట్టవద్దన్నారు. గతంలో ఇష్టానుసారంగా గురుకులాలు పెట్టి సమస్యలు గాలికి వదిలేశారని, ఈ ఆరు నెలల్లోనే తమ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నట్టుగా విమర్శలు చేయడం తగదని ఆయన హితవు పలికారు.

# శ్రీవారి ఆర్జితసేవా టిక్కెట్లు

## 19న విడుదల చేయనున్న టిటిడి

తిరుమల,ఆగస్ట్ 13 : తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన నవంబరు నెల కోటాను ఈనెల 19న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్ లో విడుదల చేయనుంది. ఈ సేవాటికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఆగస్టు 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని టీటీడీ అధికారులు సూచించారు. ఈ టికెట్లు పొందిన వారు ఈనెల 21 నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయన్నారు. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను, నవంబరు 9న శ్రీవారి ఆలయంలో నిర్వహించనున్న పుష్పయాగం సేవ టికెట్లను ఆగస్టు 22వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. వర్చువల్ సేవలు , వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన నవంబరు నెల కోటాను ఈనెల 22న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ (÷ుఅ) ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. నవంబరు నెలకు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేస్తామన్నారు. శ్రీవాణి టికెట్ల ఆన్ లైన్ కోటా.. శ్రీవాణి ట్రస్టు టికెట్లకు సంబంధించిన నవంబరు నెల ఆన్ లైన్ కోటాను ఆగస్టు 23న ఉదయం 11 గంటలకు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా నవంబరు నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేస్తుందని వెల్లడించారు. నవంబరు నెలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఈనెల 24న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తామన్నారు. తిరుమల, తిరుపతిలలో నవంబరు నెల గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నామని తెలిపారు.

7న తిరుమల, తిరుపతి శ్రీవారి సేవ కోటా ఉదయం 11 గంటలకు, నవనీత సేవ మధ్యాహ్నం 12 గంటలకు, పరకామణి సేవ మధ్యాహ్నం 1 గంటకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపారు. భక్తులు వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించారు.

# మోడీ బినామీ ఆదానీ

## ఆదానిని కాపాడుతున్న మోడీ

## ఈ ప్రయత్నాలను క్షేత్రస్థాయిలో ఎండగడతాం

## పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల వెల్లడి

న్యూఢిల్లీ,ఆగస్ట్ 13 : ఆదాని మోడీ గ్రూప్, ఆదాని మోడీ బినామీ అంటూ ఏపి పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల వ్యాఖ్యలు చేశారు. ఆదానిని కాపాడే విషయంలో మోడీ చేస్తున్న ప్రయత్నాలను ఎండగడతాం

అన్నారు. క్షేత్రస్థాయిలోకి మోడీ అవినీతిని తీసుకెళ్లేలా కార్యాచరణ ఉండబోతోందని వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ఢిల్లీ ఏఐసీసీ కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఎన్నికల సన్నద్ధత, సంస్థాగత విషయాలు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన వివిధ అంశాలపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌ఛార్జ్‌లు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సమావేశం చర్చలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలపై జూన్‌లో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో రివ్యూ చేశారని వైఎస్ షర్మిల అన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై చర్చ జరిగిందన్నారు. దేశ వ్యాప్త కార్యాచరణ సిద్ధం చేస్తున్నారని.. అన్ని రాష్ట్రాల పీసీసీ చీఫ్‌ల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారని తెలిపారు. సవివరంగా, ప్రజాస్వామ్య బద్ధంగా అందరి అభిప్రాయాలను గౌరవించే సంప్రదాయం ఒక్క కాంగ్రెస్ పార్టీలోనే ఉందన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో జరిగిన పరిణామాలపై చర్చ జరిగిందన్నారు. కులగణన అంశంపై పార్లమెంట్‌లో కాంగ్రెస్ లెవనెత్తిందని తెలిపారు.

భారత రాజ్యాంగాన్ని బీజేపీ గౌరవించడం లేదని విమర్శించారు. బీజేపీ ఏకపక్ష నిర్ణయాలపై దేశ వ్యాప్త పోరాటాలకు సిద్ధం అవుతున్నామన్నారు. బీజేపీ మైనారిటీల మనోభావాలను దెబ్బ తీసిందన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ మీద బీజేపీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. వక్ఫ్ చట్ట సవరణతో మైనార్టీల మనోభావాలను దెబ్బతీసేలా చర్యలు తీసుకుందని వ్యాఖ్యలు చేశారు. సెబీ ఆదాని అంశం ఈ సమావేశంలో చర్చకు వచ్చిందన్నారు. సెబీని తన గుప్పెట్లో పెట్టుకొని ఆదానిని కాపాడుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో రాజ్యాంగవ్యతిరేకంగా బీజేపీ వ్యవహరిస్తున్న తీరుపై కాంగ్రెస్ పోరాటం చేస్తుందన్నారు. కులగణనపై గ్రామస్థాయిలో పోరాటాలు చేయబోతోందని తెలిపారు. అవినీతిరహిత పాలన అంటూ బీజేపీ గొప్పలు చెబుతోందని.. కానీ ఆదాని - మోడీల అవినీతిని రాహుల్ గాంధీ ఎప్పుడో ఎండగట్టారన్నారు.

# గురుకులాల ప్రక్షాళన

**మొదటి పేజీ తరువాయి**

గురుకుల పాఠశాలలను సందర్శించి, విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కలెక్టర్లు, డీఎంహెచ్‌వోలు నెలకో గురుకుల పాఠశాలలో బస చేయాలని సూచించారు. ప్రభుత్వం బడ్జెట్‌లో గురుకుల పాఠశాలల పక్కా భవనాల కోసం రూ.5 వేల కోట్లు కేటాయించిందన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న గత పాలకులు నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. విద్యార్థుల డైట్ చార్జీలను పెంచడానికి త్వరలోనే అధికారులతో కమిటీ వేస్తామని ప్రకటించారు. ప్రతి గురుకులంలో అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని గురుకులాల కార్యదర్శి రమణకుమార్‌ను ఆదేశించారు. గురుకులాల్లో పనిచేసే వార్డెన్లు, టీచర్లు, పారా మెడికల్ సిబ్బంది రాత్రి సమయాల్లో విద్యార్థులకు అందుబాటులో ఉండాలన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. పెద్దాపూర్ పాఠశాలలో అభివృద్ధి పనులకు రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మృతిచెందిన ఇద్దరు విద్యార్థుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి గురుకుల సొసైటీలో ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగం ఇస్తామని హామీచ్చారు. ఆ కుటుంబాలకు ఇల్లు లేనట్లయితే ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించామన్నారు. భట్టి వెంట బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నారు. కాగా, విద్యార్థులకు తగిన పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని, వేడివేడి పదార్థాలనే వడ్డించేలా జాగ్రత్త తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్లు కూడా పాఠశాలలపై సమీక్ష నిర్వహించాలని పేర్కొన్నారు.

# ప్రతిష్టాత్మకంగా రీజినల్ రింగ్ రోడ్డు



**మొదటి పేజీ తరువాయి**

కార్యదర్శి హరీష్, రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, యాదాద్రి, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.యస్. శాంతి కుమారి మాట్లాడుతూ, ప్రతిష్టాత్మక ప్రాజెక్టు రాష్ట్రంలో అత్యధిక ప్రాముఖ్యత సంతరించుకున్నదని, ఈ ప్రాజెక్ట్ సంబంధించి వివిధ దశలలో పెండింగ్ లో ఉన్న భూసేకరణ ప్రక్రియ ను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. భూసేరణ నష్ట పరిహారనికి సంబంధించిన అంశంపై ప్రత్యేక దృష్టి సారించి భూములు కోల్పోతున్న రైతులకు న్యాయ పరమైన నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూములు కోల్పోతున్న రైతులకు సరైన నష్టపరిహారం అందేవిదంగా జిల్లా స్థాయి లో కలెక్టర్ల అధ్యక్షతన కమిటీలను ఏర్పాటు చేసి భూముల మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. కోర్టు కేసుల పై కూడా ప్రత్యేక చొరవ తీసుకుని త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు.

# నీటిపారుదల శాఖను గాడిలో పెడుతున్నాం

## రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి.. నామమాత్రంగా సాగునీరు

## గత ప్రభుత్వం కమిషన్ల కోసం రీ డిజైన్ చేసింది

## మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్,ఆగస్ట్ 13 : రాష్ట్రంలో నీటిపారుదల శాఖను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి.. నామమాత్రంగా ఆయకట్టుకు సాగునీరు ఇచ్చిందని విమర్శించారు. కమిషన్ల కోసం ప్రాజెక్టులకు పేర్లు మార్చి రీ డిజైన్ చేశారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని జలసౌధలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 15న సీతారామ ప్రాజెక్టు 3 పంపులను ప్రారంభించనున్నట్టు తెలిపారు. 2026 ఆగస్టు 15 నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. 'కాళేశ్వరం ప్రాజెక్టుకు గత ప్రభుత్వం రూ.లక్ష కోట్లు ఖర్చుపెట్టి లక్ష ఎకరాలకు సాగునీరు ఇవ్వలేదు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.27 వేల కోట్లు, సీతారామ ప్రాజెక్టుకు రూ.7,436 కోట్లు ఖర్చు చేసిన అప్పటి ప్రభుత్వం ఒక్క ఎకరాకీ నీళ్లు ఇవ్వలేదు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్నా.. కల్వకుర్తి, నె÷-టటెంపాడు, బీమా, కోయిల్‌సాగర్ పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నీటిపారుదల శాఖకు అధిక ప్రాధాన్యం ఇచ్చి నిధులు కేటాయిస్తున్నాం. భారాస నేతలు మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. వై.ఎస్.ఆర్ హయాంలో రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టు చేపట్టారు. కానీ, భారాస హయాంలో కమిషన్ల కక్కుర్తి కోసం ఆ ప్రాజెక్టును పక్కన పెట్టారు. ప్రాజెక్టు పూర్తి చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వానికి పేరు వస్తుందనే కారణంతో రీడిజైన్ చేశారు. ప్రాజెక్టుల పేర్లు మార్చి, ఖర్చు నాలుగింతలు చేశారని ఉత్తమ్ మండిపడ్డారు. కాంగ్రెస్ చేపట్టిన రాజీవ్, ఇందిరా ఎత్తిపోతలకు సుంకిశాలగా పేరు మార్చి రీ డిజైన్ చేశారని చెప్పారు. రాజీవ్, ఇందిరా ప్రాజెక్టులతో 2 వేల కోట్లతో 6 లక్షల ఎకరాలకు నీళ్లు వచ్చేవన్నారు. 19 వేల కోట్లతో సీతారామ నిర్మించారని....కమిషన్ల కక్కుర్తితో సీతారామ ఎస్టిమేషన్ ను పెంచారని ఆరోపించారు ఉత్తమ్. బీఆర్ఎస్ హయాంలో సీతారామ కాల్వలకు భూసేకరణ కూడా చేయలేదన్నారు ఉత్తమ్. సీడబ్ల్యూసీ పర్మిషన్ తామే తెచ్చామని కేటీఆర్ చెబుతున్నాడు..కానీ.. ఈ రోజు వరకు సీడబ్ల్యూసీ పర్మిషన్ పూర్తి స్థాయిలో రాలేదన్నారు. బీఆర్ఎస్ వి అన్నీ అబద్ధపు ప్రచారాలేనని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేశామన్నారు. సీతారామ మోటర్లు బిగించింది తామేనని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టులకు లక్షా 81 వేలు ఖర్చు చేశారని చెప్పారు ఉత్తమ్. బీఆర్ఎస్ పాలనలో ఇరిగేషన్ ను ఆగం చేశారని మండిపడ్డారు. ఇరిగేషన్ శాఖను గాడిలో పెట్టే పనిలో ఉన్నామన్నారు. కావాలనే ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. కాళేశ్వరంలో లక్ష కోట్లు ఖర్చు చేసినా ఎకరాకు నీళ్లియ్యలేదన్నారు. పదేళ్లు తూతూ మంత్రంగా పని చేశారని చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉండి పెండింగ్ ప్రాజెక్టులు కూడా పూర్తి చేయలేదన్నారు. తాము పెండింగ్ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఉత్తమ్ చెప్పారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేద్దాం

**మొదటి పేజీ తరువాయి**

ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారని గుర్తుచేశారు.

ఈ పథకం కింద దేశవ్యాప్తంగా సొంతిల్లు లేని కుటుంబాలకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 2024 మార్చి నాటికి 2.95 కోట్ల పక్కా ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. మొదటి విడత గడువు ముగిసినా.. ఈ పథకాన్ని కొనసాగిస్తూ రెండో విడతలో భాగంగా 2024 నుంచి 2029 మధ్యకాలంలో మరో 2కోట్ల ఇళ్లు ఇవ్వాలని ఈ నెల 9న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించామని పేర్కొన్నారు. 2018లో ఇల్లు అవసరం ఉన్నవారి కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సర్వేలో పలు రాష్ట్రాలు పాల్గొని జాబితాలు అందజేశాయని, అందులో ఇళ్లు మంజూరు కానివారితోపాటు 2011లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, కులగణన జాబితాలో.. ఇంతవరకూ ఇళ్లు మంజూరు కానివారికి తొలి పాధాన్యం ఇస్తామని తెలిపారు. ఈ రెండు జాబితాలు పూర్తయిన అనంతరం.. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో సొంతిల్లు అవసరం ఉన్నవారికోసం ప్రత్యేకంగా సర్వే నిర్వహించి వారికి కూడా ఇళ్లను మంజూరు చేస్తామని వివరించారు.

**పేదలకు అన్యాయం చేసిన కేసీఆర్..**

దేశంలోని అనేక రాష్ట్రాలు తమకు ఇళ్లు కావాలని కేంద్ర ప్రభుత్వానికి జాబితాను అందించాయని కిషన్‌రెడ్డి తెలిపారు. కానీ, తెలంగాణలో సొంతింటి అవసరం ఉన్న పేద కుటుంబాలు లక్షలాదిగా ఉన్నప్పటికీ.. 2018 సర్వేలో గత ప్రభుత్వం భాగం కాలేదని పేర్కొన్నారు.

దాంతో ఇళ్ల కోసం ఎటువంటి జాబితాను కేంద్ర ప్రభుత్వానికి పంపలేదన్నారు. "2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో పేద ప్రజలకు ఆశ చూపించి మభ్యపెట్టిందితప్ప.. ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయలేదని అన్నారు.

తెలంగాణ ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సాయం అందకుండా అన్యాయం చేసింది" అని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీతోపాటు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరైన ప్రతిపాదనలు వస్తే ఇళ్లను కేటాయించడానికి సిద్ధంగా ఉన్నామని వారు చెప్పినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ల కోసం నిర్వహించనున్న సర్వేలో పాల్గొనాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
14 ఆగస్టు
2024





## సెప్టి మోకులపై శిక్షణ శిబిరం



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: మండలంలోని యాదగిరిపల్లిలో ఆలేరు నియోజకవర్గ స్థాయిలో వంద మందికి సెప్టి మోకులపై శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బిసి వేల్ఫేర్ ఆఫీసర్ యాదగిరి పాల్గొని మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి బుర్రా వెంకటేశం అధ్వర్యంలో నడుస్తున్న సెప్టీ మోకుల గురించి వివరించారు. కోపరిటివ్ ఇన్స్పెక్టర్ దీపిక చేస్తున్నటువంటి ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని గౌడ కులస్తులు వివరించారు. ఈ కార్యక్రమంలో గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ జిల్లా అధ్యక్షులు గుల్లపల్లి వెంకటేష్ గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు బొలగాని జయరాములు గౌడ్ పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై మూడు రంగుల జెండా ఎగురవేయాలి

### పీఎం మోడీ పిలుపును విజయవంతం చేయాలి రచ్చ శ్రీనివాస్



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు 'హర్ గర్ తిరంగా" ఇంటి ఇంటికి జాతీయ జెండా తెలంగాణ ప్రజలు ప్రతి ఒక్కరూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఆవిష్కరించాలని బిజెపి రాష్ట్ర కమిటీ సభ్యులు రచ్చ శ్రీనివాస్ కోరారు. జాతీయ భావాలను తెలియజేస్తూ భారతమాతాకి వందనం సమర్పిస్తూ ఎందరో మహానుభావులు త్యాగాల వల్ల వచ్చిన స్వాతంత్ర్యం.స్వాతంత్రానికి చిహ్నంగా జాతీయ జెండాను ప్రతీ ఇంటి మీద ప్రతి వాడలో, వీధి వీధినా ఎగరవేయడం మన గర్వకారణంగా భావించాలన్నారు. ప్రాంతాలు, మతాలు వేరు అయిన మనమందరం భారతీయులామన్నారు. ఇదొక గొప్ప అవకాశం కాబట్టి ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఆవిష్కరించి గర్వంగా భారత్ మాతా కీ జై .. జైహింద్ జై తెలంగాణ ... చెప్పుకుందాం అని చెప్పారు.ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగరేద్దాం దేశం పట్ల మనకున్న గౌరవాన్ని చాటుకుందాం అని పిలుపునిచ్చారు. ఆగష్టు 11వ తేదీ నుండి 15వ తేదీ వరకు ప్రతీ ఇంటి పై త్రివర్ణ పతాకాన్ని ఎగరవేద్దామన్నారు. స్వరాజ్యం కోసం మన స్వాతంత్ర్య సమరయోధులు చేసిన పోరాటాలను మన భావి తరాలకు అందిద్దాం. ప్రతి ఒక్కరు ప్రొఫైల్ పిక్చర్ గా త్రివర్ణ పతాకం పెట్టుకోవాలి. ప్రతి ఒక్కరు గుడ్ మార్నింగ్ బదులుగా జై హింద్ అని పలకరించుకోవాలన్నారు.

## సుండీపెంటలో హర్ ఘర్ తిరంగ్



శ్రీశైలం, ఆగస్టు 13 ( రోమింగ్ న్యూస్ ) నంద్యాల జిల్లా శ్రీశైలం మండలం సున్నిపెంట నందు ఈరోజు శ్రీశైలం మండల అధ్యక్షులు మాయలూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బీజేపీ కేంద్ర రాష్ట్ర నంద్యాల జిల్లా అధ్యక్షులు ఆదేశాల మేరకు హారఘర్ తిరంగ్ అభియాన్ కార్యక్రమం భాగంగా సుండీపెంట అంబేద్కర్ సెంటర్ నుండి కూటమి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమం అంబేద్కర్ సెంటర్ మొదలు సుండీపెంట బస్టాండ్, పూర్ణనంద ఆశ్రమం, పాత మార్కెట్, బండ్ల బజారు, కాకులు సెంటర్, పెట్రోల్ బంక్, వెస్ట్రెన్ కాలనీ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీ కూటమి నాయకులు సోమి శెట్టి మల్లికార్జున, గెల్లి వెంకటేశ్వర్లు, డ్రామా మల్లికార్జున, చిక్కుడు వెంకటేశ్వర్లు, సాయి రాజ్, శ్రీను, ఆనంద్, జెడ్డ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొనడం జరిగింది.

## మల్లన్న సేవలో జనసేన నాయకురాలు రాయపాటి అరుణ



శ్రీశైలం ,ఆగస్టు 13 రోమింగ్ : ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను జనసేన పార్టీ ఫైర్ బ్రాండ్ జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీమతి రాయపాటి అరుణ మంగళవారం దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన వారికి స్థానిక జనసేన పార్టీ సమన్వయకర్త రౌతు అశోక్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శ్రీ స్వామి వార్ల జ్ఞాపిక ను బహూకరించారు. జెడ్డా దేవరాజు శ్రీమతి రాయపాటి అరుణ గారికి భగవద్గీతను బహుకరించడమైనది. కోనేటి మల్లికార్జున మంత్రు నాయక్, దేవరాజ్, వంశీ, పవన్,నరసింహా ఆచారి, జయంత్ ఆచారి,రవి ఆచారి,దేవయ్య ధనుంజయ పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ



కేసముద్రం ఆగస్టు 13 (రోమింగ్ న్యూస్): కేసముద్రం ఎస్సై మురళీధర్ రాజ్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం ముమ్మరంగా మండల కేంద్రంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు నూతన చట్టం అమలు తీరుపై అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు తమ వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలను కలిగి ఉండాలని, లైసెన్స్, ఆర్ సి, ఇన్సూరెన్స్ పత్రాలతో పాటు హెల్మెట్ తప్పకుండా ధరించి వాహనాన్ని నడపాలన్నారు. మైనర్లకు వాహనం ఇవ్వకూడదని సూచించారు..

# ఎస్.వీ.ఎన్ లో 15న జరిగే జెండా పండుగకు రారండి

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట పట్టణంలోని ఎస్.వీ.ఎన్ డిజిటల్ హైస్కూల్లో గురువారం నిర్వహించే జెండా పండుగకు తరలిరావాలని పాఠశాల వ్యవస్థాపకులు గొట్టిపర్తి భాస్కర్, డైరెక్టర్ గొట్టిపర్తి వృత్తిక్, ప్రిన్సిపాల్ గొట్టిపర్తి మాధురీలు కోరారు. 1200 ఫీట్ల జాతీయ జెండాతో ఎస్.వీ.ఎన్ స్కూల్ నుంచి యాదగిరిగుట్ట బస్ స్టేషన్ ముంచి దేవస్థానం వైకుంఠ ద్వారం వరకు జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ఆవరణలో పాఠశాల వ్యవస్థాపకులు గొట్టిపర్తి భాస్కర్ ప్రారంభిస్తారని చెప్పారు. యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ వద్ద పలువురు అధికారులు పోలీసు ఉన్నతాధికారులు, వివిధ పార్టీల నాయకులు ర్యాలీకి స్వాగతం పలుకుతారని చెప్పారు. అదేవిధంగా ర్యాలీలో పాల్గొంటారని చెప్పారు. ఉదయం ఎనిమిది గంటల 30 నిమిషాల నుంచి 10 గంటల వరకు జరిగే ర్యాలీలో దేశభక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. దేశ సమగ్రత, దేశ సార్వభౌమత్వం చాటి చెప్పడానికి భారతీయత గొప్పతనాన్ని వివరించేందుకు ప్రధానమంత్రి మోడీ ఇచ్చిన పిలుపును విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. విద్యార్థులలో దేశభక్తి సేవా తత్పరత పెరగడం కోసం ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు.











## హైడ్రాకు అసవరమైన సిబ్బంది కేటాయింపు

**ఆస్తుల రక్షణ కోసం 259మంది సిబ్బంది**

**ప్రత్యేకంగా హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు**

**చెరువుల పరిరక్షణపై రంగంలోకి దిగిన రంగనాథ్**

**కమిషనర్ పనితీరుపై దానం ఆగ్రహం**

**తన పనికి అడ్డొస్తున్నాడని విమర్శలు**




హైదరాబాద్,ఆగస్ట్ 13 : గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు, విపత్తు నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రా హైదరాబాద్ డిజాస్టర్, రెస్పాన్స్ అండ్ అసెట్స్ కు అవసరమైన ఆఫీసర్లు, సిబ్బందిని ప్రభుత్వం కేటాయించింది. 259 మంది ఆఫీసర్లు,సిబ్బందిని కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఒక్క ఐపీఎస్, ముగ్గురు గ్రూప్ 1 స్థాయి ఎస్పీలు,5 మంది డిప్యూటీ స్థాయి సూపరింటెండెంట్లు, 21 మంది ఇన్స్పెక్టర్లు,33 మంది సబ్ ఇన్ స్పెక్టర్లు,5 మంది రిజర్వ్ ఇన్ స్పెక్టర్లు,12 మంది రిజర్వ్ ఎస్ఐలు, 101 మంది కానిస్టేబుల్స్,72 మంది హోంగార్డ్స్,6 మంది అనలిటికల్ ఆఫీసర్లను కేటాయిస్తూ మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ ఆదేశాలు జారీ చేశారు. 3500 మంది అవసరమని హైడ్రా కమిషనర్ ప్రభుత్వాన్ని కోరిన సంగతి తెలిసిందే. ఇప్పటికే హైడ్రాకు ఛైర్మన్ గా సీఎం రేవంత్ రెడ్డి, కమిషనర్‌గా రంగనాథ్ ఉన్నారు. 2,500 చదరపు కిలో మీటర్ల పరిధి ఉన్న హైడ్రాకు త్వరలోనే ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటవుతుందని రంగనాథ్ వెల్లడించిన సంగతి తెలిసిందే.. ఈ పోలీస్ స్టేషన్ ద్వారానే ఎస్వోటీ ఏర్పాటు చేసి కబ్జాదారులపై క్రిమినల్ కేసులు పెడ్తామన్నారు. హైడ్రాకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు ఉందని చెప్పారు. పార్క్ స్థలాలను కాపాడే కాలనీ సంఘాలకు మద్దతిస్తామన్నారు. హైడ్రాకు మొత్తం 3,500 మంది సిబ్బంది అవసరమని, త్వరలో రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుందని తెలిపారు. హైడ్రా కింద అసెట్ ప్రొటెక్షన్‌తోపాటు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ కూడా కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న సిబ్బందితో 72 టీమ్స్?ను ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. ఇదిలావుంటే గ్రేటర్‌లో ఆపరేషన్ హైడ్రా కొనసాగుతోంది. మంగళవారం నాడు జీహెచ్ఎంసీలో చెరువులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉప్పల్ నల్లచెరువులో కబ్జాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. చెరువు పర్యవేక్షణకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించ నున్నట్లు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి సోమవారం కమిషనర్ రంగనాథ్‌ను కలసి ఉప్పల్ నల్ల చెరువులో జరుగుతున్న కబ్జాల గురించి వివరించిన విషయం తెలిసిందే. దీంతో రంగనాథ్ మంగళవారం ఉప్పల్లోని ఎమ్మెల్సీ తీన్ మార్ మల్లన్న, పరమేశ్వర్ రెడ్డి వజ్రేష్ యాదవ్, ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డితో కలిసి నల్లచెరువును పరిశీలించారు. నల్ల చెరువులో కబ్జాలను, ఆక్రమణలు పూర్తిగా తొలగించడంతో పాటు చెరువు పరిరక్షణ కోసం హైడ్రా పనిచేస్తుందని తెలిపారు. చెరువులను, నాలాలను, ఇతర ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కబ్జాలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. మరోవైపు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నందగిరి హిల్స్ హుడా లేఔట్ ఘటన నేపథ్యంలో మంగళవారం నాడు ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ... రంగనాథ్‌కు కొత్తగా వచ్చిన పదవి ఇష్టం లేనట్టుందన్నారు. అందుకే తనపై కేసు పెట్టారని దానం తీవ్ర స్వరంతో వ్యాఖ్యానించారు. అధికారులు వస్తుంటారు పోతుంటారు.. కానీ తాను మాత్రం లోకల్ అని పేర్కొన్నారు. నందగిరి హిల్స్ హుడా లేఔట్ విషయంలో అధికారులు అతిగా ప్రవర్తిస్తున్నారని ÷ర్ అయ్యారు. ఈ వ్యవహారంలో అధికారులకు ప్రివిలేజ్ నోటీసులు ఇస్తానని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని వార్నింగ్ ఇచ్చారు. అంతేకాదు.. సీఎం రేవంత్ రెడ్డికి కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. హైడ్రా అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నందగిరి హిల్స్ గురుబ్రహ్మ నగర్‌లో పేదల గుడిసెలు కూల్చివేసే అధికారం వారికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. పార్క్ స్థలం అని చెప్పి ఈవీడీఎం వాళ్లు పెద్ద ప్రహరీ గోడ కడుతున్నారని.. బస్తీ వాసులకు దారి లేకుండా ప్రహరీ గోడ ఎలా కడతారు? అని ప్రశ్నించారు. గోడ కట్టొద్దన్నందుకే ఈవీడీఎం అధికారులు తనపై కేసు పెట్టారని దానం తెలిపారు. హైదరాబాద్‌ను హైడ్రా అధికారులకేమీ రాసివ్వలేదని.. ప్రజా సమస్యలపై తన పోరాటం కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తనపై 190 కేసులు ఉన్నాయని.. కేసులకు భయపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు.

## తెలంగాణ డెయిరీని బొందపెట్టే కుట్ర

**నాలుగు నెలలైనా పాడి రైతులకు చెల్లింపులేవీ**


**కాంగ్రెస్ తీరుపై మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శలు**

హైదరాబాద్,ఆగస్ట్ 13 : తెలంగాణ డెయిరీని బొంద పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ గౌడ్ ధ్వజమెత్తారు. రైతులు పాడి పరిశ్రమ నుంచి వైదొలిగి, వలస కూలీలుగా వెళ్లే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టిస్తోంది అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి 15 రోజులకు ఒకసారి పాడి రైతులకు డబ్బులు చెల్లించేవాళ్లం. కాంగ్రెస్ హయాంలో నాలుగు నెలలకు ఒకసారి ఇస్తున్నారు. మరో నాలుగు నెలలు గడిచినా డబ్బులు ఇవ్వట్లేదు. డబ్బులు ఇవ్వకపోతే పాడి రైతు ఎలా బతుకుతాడు..? దాణా ఎక్కడ్నుంచి తెస్తాడు..? పాల ఉత్పత్తి ఎలా సాధ్యమవుతుందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని శ్రీనివాస్ గౌడ్ నిలదీశారు. రాష్ట్రంలో పాలకు బాగా డిమాండ్ ఉంది. ఒక్క హైదరాబాద్‌లోనే 30 లక్షల లీటర్లు అవసరం. 5 లక్షల లీటర్లు కూడా సేకరించలేకపోతున్నారు. ఈ 5 లక్షల లీటర్లలో 50 శాతం కేవలం మహబూబ్‌నగర్ జిల్లా నుంచే వస్తున్నాయి. మిగతా 25 లక్షల లీటర్ల పాలు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ డైయిరీని మూసేయాలని కుట్ర జరగుతోంది. ఏపీ డెయిరీని ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తుంది. గుంటూరు, విజయవాడ నుంచి పాలు వస్తున్నాయి. అవి కల్తీవో.. మంచివో తెలియని పరిస్థితి ఉంది. యూరియాతో పాలు తయారు చేస్తున్నట్లు గతంలో వార్తలు వచ్చాయని శ్రీనివాస్ గౌడ్ గుర్తు చేశారు. కల్తీ పాలతో క్యాన్సర్ వస్తుందని డాక్టర్లే చెబుతున్నారు. కల్తీ పాలు తెచ్చి హైదరాబాద్‌లో తాగిస్తున్నారు. దీంతో ప్రాణాలు పోతాయి. విషపూరితమైన పాలు తాపేందుకు ఇతర డెయిరీలను ప్రోత్సహిస్తున్నారు. తెలంగాణ డెయిరీని బొందపెట్టి ఆంధ్రా డెయిరీని పైకి లేపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందువల్లే తెలంగాణ డెయిరీకి ప్రోత్సహకాలు ఇవ్వడం లేదు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ డెయిరీని కాపాడుకున్నాం. సకాలంలో దాణా ఇచ్చాం. సబ్సిడీ మీద బర్రెలు, ఆవులను ఇచ్చారం. ఇప్పుడు సబ్సిడీ, దాణా పోయింది. పాలు పోసిన రైతులకు పైసలు ఇవ్వట్లేదు. నెయ్యిని మురగబెడుతున్నారు. యాదాద్రికి, తిరుపతికి, వేములవాడకు ఇవ్వొచ్చు కదా.. ఈ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేస్తోంది అని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు.

## కేజ్రీవాల్, కవితల కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ,ఆగస్ట్ 13 : దిల్లీ మద్యం విధానం కేసులో అరెస్టయిన దిల్లీ సీఎం అరవింద్ కేజీ్రవాల్, భారాస ఎమ్మెల్సీ కవిత జ్యూడీషియల్ కస్టడీని దిల్లీ కోర్టు పొడిగించింది. ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై అరెస్టయి ప్రస్తుతం తిహాడ్ జైలులో ఉంటున్న ఈ నేతలిద్దరి కస్టడీని సెప్టెంబర్ 2వరకు పొడిగించింది. గతంలో విధించిన జ్యూడీషియల్ కస్టడీ ముగియడంతో వీరిని దిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి కావేరి బవేజా ఎదుట వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు హాజరు పరిచారు. ఈ నేపథ్యంలో జ్యూడీషియల్ కస్టడీని పొడిగిస్తూ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు.

## అమెరికాలో భారత నూతన రాయబారిగా వినయ్ మోహన్ క్వాత్రా



న్యూఢిల్లీ,ఆగస్ట్ 13 : అమెరికాలో భారత నూతన రాయబారిగా వినయ్ మోహన్ క్వాత్రా మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం ఆయన భారత విదేశాంగ శాఖ కార్యదర్శిగా ఉన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో పదవీవిరమణ చేసిన తరణ్‌జీత్ సింగ్ సంధు స్థానంలో వినయ్ మోహన్ బాధ్యతలు చేపట్టనున్నారు. తరణ్‌జీత్ సింగ్ సంధు అమెరికా రాయబారిగా 2020 నుండి 2024 వరకు ఉన్నారు. అమెరికాలో భారత నూతన రాయబారిగావినయ్ మోహన్ క్వాత్రాకు స్వాగతం పలకడం ఆనందగా ఉందని చార్జ్ డి అఫైర్స్ శ్రీప్రియ రంగనాథన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో పనిచేయడానికి మేమంతా ఉత్సాహంగా ఉన్నామని అన్నారు. వినయ్ మోహన్ క్వాత్రా తన అధికారిక పత్రాలను అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు సమర్పించనున్నారు. 1988 బ్యాచ్‌కి చెందిన ఇండియన్ ఫారెన్ సర్వీసెస్ (ఐఎఫ్ఎస్) అధికారి క్వాత్రా ఫ్రాన్స్, నేపాల్‌లోనూ భారత రాయబారిగా ఉన్నారు. ఆ తర్వాత విదేశాంగ కార్యదర్శిగా నియమితులయ్యారు. అమెరికాలోని భారత రాయబార కార్యాలయంలో వాణిజ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

## ఎసిబి వలలో రంగారెడ్డి జాయింట్ కలెక్టర్

### లంచం తీసుకుంటుండగా పట్టివేత

హైదరాబాద్,ఆగస్ట్ 13 : రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి ఏసీబీకి చిక్కారు. ఆయనతో పాటు కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డి కూడా పట్టుబడ్డారు. ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితా నుంచి భూమి తొలగింపునకు జాయింట్ కలెక్టర్ రూ.8 లక్షల లంచం డిమాండ్ చేశారు. డబ్బును సీనియర్ అసిస్టెంట్ ద్వారా జేసీ తీసుకున్నారు. ఈ క్రమంలో ఏసీబీ అధికారులు దాడి చేసి జేసీ, సీనియర్ అసిస్టెంట్‌ను పట్టుకున్నారు. మరోవైపు నాగోల్‌లోని జేసీ భూపాల్‌రెడ్డి నివాసంలో ఏసీబీ అధికారుల సోదాలు చేపట్టారు. ఇంటిలో రూ.16లక్షల నగదు, కీలకపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. లంచం తీసుకునే అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఏసీబీ నుంచి తప్పించుకోలేరని ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ అన్నారు. జాయింట్ కలెక్టర్, సీనియర్ అసిస్టెంట్లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. వీరిని పట్టుకోవడానికి ఏసీబీ బృందం సోమవారం రాత్రి ఎంతో చాకచక్యంగా పని చేసిందని కొనియాడారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
14 ఆగస్టు
2024






# సెప్టెంబర్ 8న గోపా రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం

- జనరల్ బాడీ సక్సెస్ కోసం కసరత్తు షురూ...!!
- విలువైన సూచనలు
- సలహాలు అందించిన ఈసీ సభ్యులు
- సెప్టెంబర్ 8న జరిగే జనరల్ బాడీ విజయవంతంకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనమైన ఏర్పాట్లకు నిర్ణయం

హైదరాబాద్, రోమింగ్ న్యూస్: సెప్టెంబర్ 8న గోపా రాష్ట్రస్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని గోపా రాష్ట్ర కమిటీ తీర్మానించింది. గోపా రాష్ట్ర శాఖ అధ్యక్షులు మద్దెల రమేష్ బాబు గౌడ్ అధ్యక్షతన మంగళవారం జరిగిన వర్చువల్ సమావేశంలో జనరల్ బాడీ ఏర్పాట్లు... ఎన్నికల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన కసరత్తుపై చర్చించారు. సెప్టెంబర్ 8న హైదరాబాదులోని భాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జనరల్ బాడీ సమావేశం, ఎన్నికల నిర్వహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని ఈసీ తీర్మానించింది. మొదటగా అధ్యక్షుని తొలి పలుకులతో మొదలై సెక్రెటరీ బండి సాయన్న గౌడ్ రిపోర్టు ను జనరల్ బాడీకి సమర్పిస్తారని చెప్పారు. అదేవిధంగా 2021 నుంచి 24 వరకు జరిగిన ఖర్చులకు సంబంధించిన వివరాలను కూడా జనరల్ బాడీ ముందు ఉంచానున్నారు. రెండవ సెషన్ మధ్యాహ్నం రెండు గంటల నుంచి మొదలై రాష్ట్ర ఎన్నికల బాడిని ఎన్నికల కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. అనంతరం కొత్తగా ఎన్నికైన అధ్యక్షుని అనుమతితో కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు.

**సెప్టెంబర్ 8 షెడ్యూల్ ఇది**

ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు జనరల్ బాడీ సమావేశం.




ఒంటిగంట నుంచి రెండు గంటల వరకు లంచ్
రెండు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎన్నికల కార్యక్రమం
నాలుగు గంటల నుంచి 5 గంటల వరకు ముగింపు కార్యక్రమం జరుగుతుందని సమావేశం తీర్మానించింది.

జనరల్ బాడీ సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బండి సాయన్న వెల్లడించారు. అన్ని జిల్లాలలో ఈ నాలుగు సంవత్సరాల్లో తీసుకున్న నిర్ణయాలు అమలు సాధించిన ప్రగతి, సాధించాల్సిన ప్రగతిపై చర్చ జరుగుతుందని చెప్పారు. ఈ పీరియడ్ లోనే అసెంబ్లీ, లోకసభ ఎన్నికలు జరిగాయని వీటి విషయంలో గోపా నిర్వహించిన పాత్ర ఎంతో ప్రశంసనీయమని ప్రత్యక్షంగా గౌడ అభ్యర్థుల గెలుపు కోసం ఎంతో కృషి చేసిందని ఈ సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు. గోపా నిర్మానాత్మక దశ వైపుకు వెళుతుందని ఒకప్పుడు హైదరాబాదుకే పరిమితమైన గోపా ఈ నాలుగేళ్లలో జిల్లాలకు కూడా వ్యాపించిందని అభిప్రాయాన్ని ఈసీ సభ్యులు వ్యక్తం చేశారు. అంతేకాకుండా జిల్లా కేంద్రాలలో నిర్మాణాత్మకమైనటువంటి కృషి జరగడం వల్ల గోపా పెద్దన్న పాత్ర నిర్వహిస్తున్న విషయం వర్చువల్ గా జరిగిన సమావేశంలో ప్రసంగించిన వ్యక్తులు అభిప్రాయపడ్డారు. ఎంతో బాధ్యతతో గోపా తనదైన శైలిలో భూమిక నిర్వహిస్తున్నదని, దీని పరిధిని మరింత విస్తృత పరచడానికి ఎన్నికల కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన అవసరాన్ని పలువురు సభ్యులు గుర్తు చేశారు. ఎంత మంది వస్తారు..? వారికి ఏర్పాట్లు ఎలా చేయాలి. భోజనాలు ఎంత మందికి చేయాలి... విజయవంతంగా ఎన్నికల పర్వాన్ని కొనసాగించడం ఎలా? అనే విషయాల పైన కూడా పలువురు సభ్యులు తమ విలువైన సలహాలను, సూచనలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి మొగిలి రఘు నాథ్ గౌడ్, స్టేట్ ఈసీ సభ్యులు
డాక్టర్ అనిల్ రాచమల్ల, కుర్రేముల యాదగిరి గౌడ్, గొట్టిపర్తి భాస్కర్ గౌడ్, మేకపోతుల ఆంజనేయులుగౌడ్, అమరేందర్ గౌడ్, పబ్బు అయోధ్య గౌడ్, తాల్లపల్లి రామకృష్ణ గౌడ్, అమరగాని నర్సయ్య గౌడ్, కారింగుల బిక్షమయ్య గౌడ్, చీకూరి సత్యం గౌడ్, యలమకంటి మీరయ్య్య గౌడ్, మాద సైదులు గౌడ్, బత్తిని వినయ్ కుమార్ గౌడ్, గూడెపూరి వేణు బాబు గౌడ్, బత్తిని సత్యనారాయణ గౌడ్, అనిల్ గౌడ్, డాక్టర్ చిర్రా రాజు గౌడ్, ముకురాల చంద్ర శేఖర్ గౌడ్, రాపర్తి సురేష్ గౌడ్, నీల కంటేశ్వర్ రావు గౌడ్, అమరగాని శ్రీనివాస్ గౌడ్, కళ్యాణ్ చక్రవర్తి గౌడ్, గుడిద శ్రీనివాస్ గౌడ్, మాద శ్రీరాములు గౌడ్, కుర్ర శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ ఉప్పు నూతల నాగరాజు గౌడ్, రాజా నరేందర్ గౌడ్, కోల రమేష్ రమేష్ గౌడ్, భైరి లక్ష్మి నారాయణ గౌడ్, బాలసాని సత్తయ్య గౌడ్, బత్తిని అనిల్ కుమార్ గౌడ్, పొన్నం విజయ దేవరాజ్ గౌడ్, బాలసాని విక్రమ్ గౌడ్, డాక్టర్ రంజిత్ గౌడ్, తమటం లక్ష్మణ్ గౌడ్, శాంతి కుమార్ గౌడ్, కారుపోతుల పండరి గౌడ్,
తో పాటు పలువురు ఈసీ సభ్యులు ఆయా జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొని మాట్లాడారు. ఏర్పాట్ల విజయవంతం కోసం సెప్టెంబర్ 8లోగా 1 లేదా రెండుసార్లు వర్చువల్ సమావేశాలు నిర్వహించడం అవసరమని ఈ మేరకు తేదీలను ఖరారు చేయాలని తీర్మానించారు. సెప్టెంబర్ 8 లోగా మరో రెండు వర్చువల్ సమావేశాల నిర్వహణ ద్వారా తీసుకున్న ఫీడ్బ్యాక్ తో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఈసి కార్యాచరణ ప్రణాళికను తీసుకోనున్నది.

## స్వగ్రామానికి సేవ చేయడం అభినందనీయం



కేసముద్రం ఆగస్టు 13 (రోమింగ్ న్యూస్): ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా తన సొంత గ్రామాన్ని మరవకుండా సామాజిక సేవ చేయడం అభినందనీయమని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ సుశీల అన్నారు. కేసముద్రం మండలం ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఇదే గ్రామానికి చెందిన హైదరాబాద్ అసిస్టెంట్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (ఏసీఎఫ్) ఎసల్ల అప్పయ్య తన సొంత ఖర్చులతో మూపై వేల రూపాయలు విలువైన టై, బెల్టు,బ్యాడ్జీ,ఐడీ కార్డు,షూ లను ఆయన తండ్రి కట్టయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయురాలు విజయ సుశీల మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు సహాయం అందించడం హర్షనీయమని అన్నారు. విద్యార్థులు తమకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఇదే పాఠశాలలో విద్యను అభ్యసించిన ఏసిఎఫ్ ఎసల్ల అప్పయ్యను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

## రైతులందరికి రుణమాఫీ ఎందుకు చేయలేదు

### మంత్రి పొన్నం ప్రభాకర్ రిబ్బన్ కటింగ్ మాస్టర్

### ఎద్దేవా చేసిన బిఆర్ఎ నేతలు పెద్ది తదితరులు



హైదరాబాద్,ఆగస్ట్ 13 : మంత్రి పొన్నం ప్రభాకర్కు పరిపాలనపై కనీస అవగాహన లేదని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ నేతలను తిట్టడమే కాంగ్రెస్ నాయకులు పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ హయాంలో కొనుగోలు చేసిన బస్సులకు హస్తం పార్టీ నేతలు రిబ్బన్ కట్చేస్తున్నారని ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో రైతులందరికి రుణమాఫీ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. వేలాది మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. హైదరాబాద్ తెలంగాణ భవన్లో పార్టీ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, పల్లె రవికుమార్తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రకరకాల కారణలతో రైతులకు రుణాలు మాఫీ చేయడం లేదని విమర్శించారు. రుణమాఫీ కోసం బీఆర్ఎస్ తరఫున కాల్ సెంటర్ పనిచేస్తుందన్నారు. ఇప్పటివరకు మాఫీపై సుమారు 75 వేల ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. ఇంకా చాలామంది రైతులు ఆగస్టు 15 కోసం చూస్తున్నారని చెప్పారు. 15వ తేదీ తర్వాత సీఎం రేవంత్ రెడ్డి పల్లెల్లో పర్యటించడం అనుమాణమేనని తెలిపారు. రుణమాఫీ కోసం రూ.45 వేల కోట్లు అవసరముంటే.. రూ.18 వేల కోట్లతోనే మమ అనిపించాలని చూస్తున్న ప్రభుత్వ కుట్రలు రైతులకు అర్థమవుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ 9 నెలల పాలనలో రూ.50 వేల కోట్ల అప్పు అయిందన్నారు. త్వరలో కాంగ్రెస్ నేతల అరాచకాలను బయటపెడతామని చెప్పారు. రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు ఎందుకు పెరుగుతున్నాయని ప్రశ్నించారు. కాగా, పోలీసుల పహారా మధ్య కాంగ్రెస్ పాలన సాగుతున్నదని ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు.

## అదానీ-సెబీ బంధం దేశంలోనే అతిపెద్ద కుంభకోణం

### హిండెన్‌బర్గ్ ఆరోపణలతో బట్టబయలు

### సెబీ చీఫ్ తొలగింపు డిమాండ్‌తో 22న దేశవ్యాప్త ఆందోళన

### కాంగ్రెస్ పార్టీ నిర్ణయం

న్యూఢిల్లీ,ఆగస్ట్ 13 : అదానీ-హిండెన్‌బర్గ్ వివాదం వేడెక్కుతోంది. హిండెన్‌బర్గ్ ఆరోపణల నేపథ్యంలో సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ అండియా సెబి చీఫ్ మాధబి పూరి బచ్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 22న దేశవ్యాప్త నిరసనలకు కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఆయా రాష్ట్రాల్లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయా ల వద్ద నిరసలకు దిగాలని నిర్ణయించింది. అదానీ గ్రూప్ కంపెనీలపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మంగళవారంనాడిక్కడ జరిగిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ విషయాన్ని వెల్లడించారు. 'కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నాయకత్వంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జులు, పీసీసీ అధ్యక్షులతో మంగళవారం సమావేశం జరిగింది. అదానీ-సెబీకి సంబంధం ఉన్న హిండెన్‌బర్గ్ వ్యవహారం దేశంలోనే అతిపెద్ద కుంభకోణంగా నిలవడంపై ప్రధానంగా చర్చించాం' అని కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఈ కుంభకోణంలో మోదీ ప్రమేయంపై ఆరోపణలు గుప్పి?స్తూ, ప్రధానంగా తాము రెండు అంశాలపై దేశవ్యాప్త ఆందోళనలకు నిర్ణయించామని చెప్పారు. ప్రధాన మంత్రి పూర్తి ప్రమేయం ఉన్న అదానీ మెగా స్కామ్‌పై జేపీసీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఫైనాన్షియల్ మార్కెట్ రెగ్యులేషన్ విషయంలో పూర్తిగా మోదీ రాజీపడ్డారని ఆరోపించారు. సెబీ బాస్ రాజీనామా చేయాలనేది కూడా తమ మరో డిమాండ్ అని చెప్పారు. దేశవ్యాప్త నిరసనల్లో భాగంగా ఆయా నగరాల్లోని ఈడీ కార్యాలయాలను ముట్టడిస్తామని తెలిపారు. సెబీ చైర్‌పర్సన్ మాధబి పురి బచ్‌పై ఆగస్టు 10న హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంచలన ఆరోపణలు చేసింది. అదానీ గ్రూప్ సంస్థల షేర్ల విలువను కృత్రిమంగా పెంచేందుకు వినియోగించిన మారిషస్ ఫండ్‌లలో మాధబి పురి, ఆమె భర్తకు వాటాలున్నాయని ఆరోపించింది. దీనిపై బచ్ ఘాటుగా స్పందించారు. ఇది వ్యక్తిత్వ హననమేనని అన్నారు. అదానీ గ్రూప్ సైతం హిండెన్‌బర్గ్ ఆరోపణలు కొట్టివేసింది. సెబీ చైర్‌పర్సన్‌తో కానీ, ఆమె భర్తతో కానీ తమకు ఎలాంటి వాణిజ్య సంబంధాలు లేవని తెలిపింది.

## దేశవ్యాప్తంగా వైద్యుల ఆందోళన

### వైద్యసేవల నిలిపివేతతో రోగులకు ఇబ్బందులు

న్యూఢిల్లీ,ఆగస్ట్ 13 : పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతా లో ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ ఘటనను నిరసిస్తూ వైద్యులు ఆందోళన బాట పట్టారు. ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఫోర్డా) ఆధ్వర్యంలో ప్రభుత్వ దవాఖానల రెసిడెంట్ డాక్టర్లు ఢిల్లీ, కోల్‌కతా, రాజస్థాన్, యూపీ సహా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ కోరుతున్నారు.వైద్యుల సమ్మెతో దవాఖానల్లో పలు వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది. ఓపీ సేవలు, అత్యవసరం కాని సర్జరీలు నిలిచిపోయాయి. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంటల కొద్దీ ఆసుపత్రుల ముందు క్యూలో నిల్చున్నా ఫలితం లేకుండా పోయింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు వైద్యుల సమ్మెతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వైద్యుల సమ్మెకు అర్థం ఉందని.. మరి మా పరిస్థితి ఏంటని వాపోతున్నారు.

## బాన్సువాడలోనూ ఉప ఎన్నిక తప్పదు

### పోచారంకు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం

### నియోజకవర్గ నేతలతో కెటిఆర్ చిట్‌చాట్

హైదరాబాద్,ఆగస్ట్ 13 : బాన్సువాడ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పార్టీ మారిన పోచారం శ్రీనివాస్ రెడ్డికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులు నందినగర్ నివాసంలో కేటీఆర్ ను కలిశారు. ఈ సందర్భంగా వారితో ఆయన మాట్లాడారు. పోచారం శ్రీనివాస్ రెడ్డిని అన్ని రకాలుగా గౌరవించినప్పటికీ పార్టీని వీడటం ఆయనకే నష్టమని కేటీఆర్ చెప్పారు. కార్యకర్తల కష్టం మీద గెలిచి ఆ తర్వాత స్వార్థం కోసం పార్టీని వీడటం కార్యకర్తలను బాధించిందన్నారు. అయితే కష్ట కాలంలో పార్టీకి ద్రోహం చేసిన వాళ్లు ఎంత పెద్ద వా÷-ళ్లైనా సరే వదిలిపెట్టేది లేదని వారికి కచ్చితంగా కార్యకర్తలు బుద్ధి చెబుతారని కేటీఆర్ హెచ్చరించారు. కాంగ్రెస్‌లోకి వెళ్లిన తర్వాత పోచారం శ్రీనివాస్ రెడ్డిని కనీసం అడిగిన వాళ్లు కూడా లేని దయనీయ పరిస్థితి వచ్చిందని చెప్పారు.రేవంత్ రెడ్డి పరిపాలన సమర్థత ఏంటో ప్రజలకు తెలిసిపోయిందని? మార్పు పేరుతో జనాన్ని ఏమారుస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. బాన్సువాడ ఉప ఎన్నికల్లో కచ్చితంగా పోచారం ను ఓడిస్తామని చెప్పారు. త్వరలోనే ప్రశాంత్ రెడ్డి, ఇతర పార్టీ సీనియర్ నాయకులు సహా తాను బాన్సువాడలో పార్టీ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. పార్టీని మోసం చేసి నాయకులు వెళ్లిపోయినప్పటికీ కార్యకర్తలు మాత్రం పార్టీ వీడలేదని?బీఆర్ఎస్‌కు కార్యకర్తలే కొండంత అండ అని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు. ఉప ఎన్నికల్లో కచ్చితంగా పార్టీ మారిన వ్యక్తులకు ప్రజలు బుద్ధి చెబుతారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. గులాబీ జెండా మీద గెలిచిన పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీ వీడినా? గ్రామాల్లో పార్టీ కార్యకర్తలంతా బీఆర్ఎస్ పార్టీతోనే ఉన్నారని పార్టీ శ్రేణులు కేటీఆర్‌కు తెలిపారు.

## ప్రజావాణికి వెల్లువెత్తిన దరఖాస్తులు

### వివిధ సమస్యలపై 475 మంది వినతులు

హైదరాబాద్,ఆగస్ట్13 : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 475 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 120, మైనారిటీ వెల్ఫేర్ కు సంబంధించి 60, సాంఘిక సంక్షేమ శాఖ కు సంబంధించి 53, పంచాయత్ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 38, పౌరసరఫరాల శాఖ కు సంబంధించి 36, ఇతర శాఖలకు సంబంధించి 168 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి శ్రీమతి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.





## తెలంగాణలో మూడ్రోజుల పాటు వర్షాలు

### హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్,ఆగస్ట్ 13 : తెలంగాణలో రాగల మూడురోజుల పాటు తేలికపాటి మోస్తరు వర్షాపాతం కురిసే నమోదయ్యే ఛాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. సోమవారం నాటి ద్రోణి రాయలసీమ కొమొరిన్ ప్రాంతం వరకు విస్తరించి సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతుందని పేర్కొంది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు పలుచోట్ల ఉరుములు, మెరుపులు.. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. శుక్రవారం వరకు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24 గంటల్లో హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తెలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ములుగు, జయశంకర్, నల్గొండ, హైదరాబాద్ జీహెచ్ఎంసీలో వర్షం కురిసింది. అత్యధికంగా హైదరాబాద్ నగర పరిధిలోని ఖైరతాబాద్‌లో 8.3 సెంటీమీటర్ల వర్షాపాతం రికార్డయ్యింది.

## పతంజలి ప్రకటనల వ్యవహారం

### రాందేవ్ బాబా, ఆచార్య బాలకృష్ణలకు ఊరట

### ధిక్కరణ కేసును మూసేసిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ,ఆగస్ట్ 13 : యోగా గురు రామ్‌దేవ్ బాబా కు భారీ ఊరట లభించింది. తప్పుదోవ పట్టించే ప్రకటనలను రూపొందించారని పతంజలి ఆయుర్వేద్ ఎండీ ఆచార్య బాలకృష్ణ, యోగా గురు బాబా రామ్‌దేవ్‌లపై నమోదైన ధిక్కరణ కేసును సుప్రీంకోర్టు మూసివేసింది. ఈ ప్రకటనలకు సంబంధించి రామ్ దేవ్ బాబా, ఎండీ ఆచార్య బాలకృష్ణ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పిన విషయం తెలిసిందే. ఇకపై అలాంటి యాడ్స్ ఇవ్వబోమని కోర్టుకు విన్నవించారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న సుప్రీం ధర్మాసనం.. వారిపై ధిక్కరణ కేసును మూసివేసింది. కొవిడ్ వ్యాక్సినేషన్, అల్లోపతికి వ్యతిరేకంగా పతంజలి ప్రచారం చేసిందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆరోపించింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై జస్టిస్ హిమా కోహ్లీ, అమానుల్లాతో కూడిన ధర్మాసనం విచారణ జరుపుతోంది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా పంతజలిపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, ఆరోపించిన తప్పుదోవ పట్టించే ప్రకటనలను పతంజలి ప్రింట్ మీడియాలో ప్రచురించింది. జనవరి 3, 2024న జరిగిన విచారణలో పతంజలిపై ధిక్కార చర్య తీసుకున్నందుకు బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ధిక్కార నోటీసులు జారీ చేసినా స్పందన లేకపోవడంతో.. ఇద్దరిని వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది. బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణ క్షమాపణలు కోరారు. ఆ క్షమాపణలను కోర్టు తిరస్కరించింది. తప్పుడు ప్రకటనలపై క్షమాపణలు కోరుతూ పత్రికల్లో యాడ్స్ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. మళ్లీ 7న విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం పతంజలిని మందలించింది. ఆ తర్వాత విచారణలో బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణలకు వ్యక్తిగత హాజరు నుంచి సర్వోన్నత న్యాయస్థానం మినహాయింపును ఇచ్చింది. అనంతరం మే 14న తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం.. నేడు తీర్పు వెలువరించింది. కోర్టు ధిక్కరణ కేసును ముగిస్తూ తీర్పు వెలువరించింది. అయితే, తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఈ సందర్భంగా న్యాయస్థానం హెచ్చరించింది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం 14
ఆగస్టు 2024





# వక్ఫ్ జెపిసికి ఛైర్మన్‌గా జగదంబికాపాల్

## స్పీకర్ ఓం బిర్లా ప్రకటన విడుదల

న్యూఢిల్లీ,ఆగస్ట్ 13 : పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లు-2024 పై అధ్యయనానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీని కేంద్రం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. మొత్తం 31 మంది సభ్యులతో ఈ కమిటీ ఏర్పాటైంది. తాజాగా ఈ కమిటీకి చైర్మన్‌గా బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ ను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నియమించారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వక్ఫ్ (సవరణ) బిల్లు 2024ను కేంద్రం గురువారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే. వక్ఫ్ ఆస్తులను నియంత్రించే అధికారాలను కేంద్ర ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్లకు దఖలుపరిచే విధంగా సవరణలు ప్రతిపాదించడం వివాదాస్పదమైంది. అంతేకాకుండా మహిళలతోపాటు, ముస్లిమేతరుల కు వక్ఫ్‌బోర్డుల్లో ప్రాతినిధ్యం కల్పించే ప్రతిపాదనపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ బిల్లును విపక్ష ఇండియా కూటమి పార్టీలకు చెందిన ఎంపీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో వెనక్కి తగ్గిన కేంద్రం బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపేందుకు అంగీకరించింది. ఈ నేపథ్యంలోనే జేపీసీని ఏర్పాటు చేసింది. ఇందులో లోక్‌సభ నుంచి 21 మంది సభ్యులకు అవకాశం కల్పించారు. జగదాంబికా పాల్ (కమిటీ చైర్మన్), నిషికాంత్ దూబే, తేజస్వి సూర్య, అపరాజిత సారంగి, సంజయ్ జైస్వాల్, దిలీప్ సైకియా, అభిజిత్ గంగోపాధ్యాయ, డీకే అరుణ, గౌరవ్ గొగోయ్, ఇమ్రాన్ మసూద్, మొహమ్మద్ జావేద్, మౌలానా మొహిబుల్లా నాద్వి, కళ్యాణ్ బెనర్జీ, ఎ రాజా, లావు శ్రీ కృష్ణ దేవరాయలు, దిలేశ్వర్ కమైత్, అరవింద్ సావంత్, సురేష్ గోపీనాథ్, నరేష్ గణపత్, అరుణ్ భారతి, అసదుద్దీన్ ఒవైసీ కమిటీ సభ్యులుగా ఉన్నారు. ఇక రాజ్యసభ నుంచి బ్రిజ్ లాల్, మేధా విక్రమ్ కులకర్ణి, గులాం అలీ, రాధా మోహన్ దాస్ అగర్వాల్, సయ్యద్ నజీర్ హుస్సేన్, మొహమ్మద్ నదీముల్ హఖ్, విజయసాయి రెడ్డి, మొహమ్మద్ అబ్దుల్లా, సంజయ్ సింగ్ , ధర్మశాల వీరేంద్ర హెగ్డే ఈ కమిటీకి సభ్యులుగా వ్యవహరించనున్నారు.

# యూనివర్సిటీల్లో ఉన్నత విద్యలో మెరుగైన విద్య

## సహాయ, సహకారాలు అందిస్తామన్న సింగపూర్ యూనివర్సిటీ

అమరావతి,ఆగస్ట్ 13 : ఆంధ్రప్రదేశ్ యూనివర్సిటీల్లో ఉన్నత విద్యలో మెరుగైన విద్య, ర్యాంకింగ్స్, సంస్కరణల అమలుకు సహాయ, సహకారాలు అందిస్తామని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ ప్రొఫెసర్ ఎం.వి.ఆర్.చౌదరి స్పష్టం చేశారు. ఏపీలో ఉన్నత విద్యారంగంలో సంస్కరణలకు తప్పకుండా తోర్పాటు అందిస్తామని విద్యా, ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌కు ఆయన హామీ ఇచ్చారు. సోమవారం రోజున నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ 2024లో ఏపీకి చెందిన 31 యూనివర్సిటీలు చోటు సంపాదించాయి. అయితే వీటిలో మరింత మెరుగైన విద్య అందించేందుకు ఎం.వి.ఆర్. చౌదరితో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల పనితీరు మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై వారిద్దరూ కూలంకశంగా చర్చించారు. రీసెర్చ్, ఇన్నొవేషన్స్‌లో వెనకబడి ఉండటమే ఏపీలో ర్యాంకింగ్స్ తగ్గుదలకు కారణం అని ఆయన చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తేవడానికి అవసరమైన పాఠ్యాంశాల మార్పులు, ఇతర విధానాలను విశ్వవిద్యాలయాలతో పంచుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ప్రొఫెసర్ చౌదరి వెల్లడించారు. కార్యచరణ అమలుకు త్వరలోనే ప్రణాళిక రూపొందించనున్నట్లు మంత్రి లోకేశ్ చెప్పారు.

# ఎన్ఆర్ఐ డాక్టర్ ఇల్లు బేరంలో మోసం

## రంగంలోకి దిగిన నగర పోలీసులు

హైదరాబాద్,ఆగస్ట్ 13 : హైదరాబాద్‌లోని తన ఇల్లు విక్రయానికి పెట్టిన ఓ ఎన్ఆర్ఐ వైద్యురాలి బ్యాంకు ఖాతా లావాదేవీలను సైబర్ పోలీసులు నిలిపివేశారు. రూ.10 కోట్లకు సంబంధించి జరిగిన లావాదేవీల్లో సైబర్ మోసం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో నగరానికి వచ్చిన ఆమె జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమెరికాలో నివసించే డాక్టర్ బినోతి మార్తాండ్‌కు జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్‌లో 334 చదరపు గజాల స్థలంలో ఇల్లు ఉంది. దీన్ని విక్రయించడానికి నిర్ణయించి వివరాలు ఇంటర్నెట్‌లో పెట్టారు. గురునాథ్ అనే రియల్‌ఎస్టేట్ ఏజెంట్‌ను కూడా నియమించుకున్నారు. అతని ద్వారా 2022లో షేక్ బషీర్ అలియాస్ బాబు అనే వ్యక్తి ఆమెను వాట్సప్‌లో సంప్రదించారు. అయితే ఎలాంటి ఒప్పందానికి రాలేదు. తాజాగా ఈ ఏడాది జులైలో బషీర్ ఆమెకు ఫోన్‌చేసి.. రూ.12.5 కోట్లకు ఒప్పందం చేసుకోగా మూడు విడతలుగా రూ.11 కోట్లు ఆమె సూచించిన ఖాతాకు బదిలీ చేశారు. మరో రూ.1.5 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. టీడీఎస్‌కు డబ్బులు కట్టాల్సి ఉందని బషీర్ కోరడంతో ఆమె రూ.1,48,75,000 అతని ఖాతాలో వేశారు. ఈ క్రమంలో జులై 16న షేక్ బషీర్ ఆ ఇంటిని తన అధీనంలోకి తీసుకునా న్నరు. అయితే 19వ తేదీన ఊహించని రీతిలో ఎన్ఆర్ఐ ఖాతాను సైబర్ పోలీసులు సీజ్ చేశారు. ఈ చెల్లింపుల్లో సైబర్ మోసం జరిగిందంటూ ఖాతాను నిలిపివేసినట్లు పేర్కొన్నారు. దీంతో షాక్‌కు గురైన వైద్యురాలు వెంటనే బషీర్‌కు ఫోన్ చేశారు. స్పందించక పోవడంతో 28న తన కుమారుడు జాన్ మార్తాండ్‌తో ఆమె హైదరాబాద్‌కు వచ్చారు. ఇంటివద్దకు వెళ్లగా బషీర్‌కు చెందిన సెక్యూరిటీ సిబ్బంది కనిపించారు. అంతకుముందు ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను తొలగించి వేరేవి పెట్టినట్లు గుర్తించారు. బషీర్ తన ఫోన్‌కాల్స్‌కు స్పందించకపోవడంతో ఆమె ఈ విషయమై ఫిర్యాదు చేసినట్లు జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

# తుంగభద్రలో నిర్వహణ లోపం

## డ్యామ్‌ను పరిశీలించిన మంత్రులు

కర్నూలు,ఆగస్ట్ 13 : నిర్వహణ లోపం కారణంగానే ప్రాజెక్టులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. గత వైకాపా ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణ కోసం నిధులు వెచ్చించలేదని విమర్శించారు. తుంగభద్ర డ్యామ్‌ను మంత్రి పయ్యావుల కేశవ్‌తో కలిసి ఆయన ఈ ఉదయం పరిశీలించారు. సాధ్యమైనంత తర్వలో స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటు చేస్తామని చెప్పారు. భవిష్యత్ కార్యాచరణపై నిపుణులతో చర్చిస్తామని మంత్రి పయ్యావుల అన్నారు. డ్యామ్ పటిష్ఠత, మరమ్మతులపై అధికారులతో మంత్రులు సమీక్షించనున్నారు. తుంగభద్ర ప్రాజెక్టులో వరద ఉద్ధృతికి 19వ గేటు కొట్టుకు పోయిన విషయం తెలిసిందే. దీంతో మూడు రోజులుగా లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా వెళ్తోంది. వరదను అడ్డుకునేందుకు తాత్కాలిక గేటు ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు నేడు తుంగభద్ర డ్యామ్ వద్దకు కర్ణాటక సీఎం రానున్నారు.

# విద్యాశాఖలో సమూల మార్పులు జరగాలి

### పాఠశాల విద్యపై ప్రభుత్వం రూ.32వేల కోట్లు ఖర్చు

### క్షేత్ర స్థాయిలో దీనికి తగ్గ ఫలితాలు కనిపించాలి

### విద్యాశాఖ, నైపుణ్య గణన అంశాలపై సిఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి,ఆగస్ట్ 13 : విద్యాశాఖలో సమూల మార్పులు జరగాలని, ఉత్తమ విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించటమే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పాఠశాల విద్యపై ప్రభుత్వం రూ.32వేల కోట్లు ఖర్చు చేస్తోందని క్షేత్ర స్థాయిలో దీనికి తగ్గ ఫలితాలు కనిపించాలని సీఎం స్పష్టం చేశారు. విద్యాశాఖ, నైపుణ్య గణన అంశాలపై ముఖ్యమంత్రి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సిలబస్‌లో మార్పులు చేయాలని సూచించారు. ఇందుకోసం విద్యా రంగ నిపుణులు, మేధావులు, ఆయా రంగాల ప్రముఖులతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. వచ్చే 10-20 ఏళ్లకు ఎలాంటి పాఠ్యాంశాలు అవసరమన్న అంశాన్ని గుర్తించి బోధిస్తే మంచి ఫలితాలు ఉంటాయని సీఎం అన్నారు. ప్రచార ఆర్భాటం కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలన్నారు. బడి ఈడు పిల్లలు బయట ఉండడానికి వీల్లేదని, ఈ విషయంలో కఠినంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేటు విద్యాసంస్థలతో ప్రభుత్వ పాఠశాలలు పోటీ పడాలని, ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. మరో వైపు విద్యాశాఖలో తీసుకువచ్చిన నూతన విధానాలు, సంస్కరణలపై ఆశాఖ మంత్రి నారా లోకేశ్ సీఎంకు వివరించారు. ఒక తరగతికి ఒక టీచర్ అనే విధానం అమలు చేస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులపై అనవసరపు ఒత్తిడి లేకుండా యాప్‌ల భారాన్ని కూడా తగ్గించామన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న నైపుణ్య గణన కార్యక్రమంపై అధికారులు ముఖ్యమంత్రికి ప్రజంటేషన్ ఇచ్చారు. నైపుణ్య గణన కోసం రూపొందించిన విధివిధానాల్ని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3.54 కోట్ల మంది పనిచేసే వయసు ఉన్న ప్రజలు ఉన్నారని.. వారి నైపుణ్యాలను గణన చేయాల్సి ఉందని తెలిపారు. దీని కోసం 48 వేల మంది ఎన్యుమరేటర్లు అవసరమని స్కిల్ సెన్సస్ కోసం 8 నెలల సమయం పడుతుందని తెలిపారు. కేవలం సర్వే చేసేందుకే 55-70 రోజుల సమయం పట్టే అవకాశముందని అధికారులు సీఎంకు వివరించారు. ప్రాథమిక నైపుణ్యం, వ్యక్తిగతంగా సాధించిన నైపుణ్యాలతో పాటు ఏఏ అంశాల్లో నిపుణత ఉందన్న అంశాలను కూడా గుర్తించాలని సీఎం సూచించారు. ఇంటింటి సర్వే, మీ సేవా కేంద్రాలు, విద్యా సంస్థలు, మొబైల్ యాప్‌ల ద్వారా స్కిల్ సెన్సెస్ నిర్వహించే అవకాశముందని అధికారులు ప్రతిపాదించారు. ఇప్పటికే ఉన్న నిపుణ అనే పోర్టల్ ద్వారా కూడా నైపుణ్య గణన కార్యక్రమాన్ని చేపట్టవచ్చని అధికారులు వివరించారు. పారిశ్రామిక రంగ ప్రతినిధులతో కూడా సంప్రదించి నైపుణ్య గణన కార్యక్రమాన్ని చేపట్టాలని సీఎం సూచించారు. మరికొంత కసరత్తు తరువాత నైపుణ్య గణన కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిందిగా సీఎం ఆదేశాలు జారీ చేశారు.

# రాజకీయ పార్టీల మైండ్‌గేమ్!

తెలంగాణలో అధికారం కోల్పోయిన బిఆర్ఎస్‌కు ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించక పోవడంతో పలువురు ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌కు కోల్పోవాల్సి వచ్చింది. ఇది ఎంతవరకు అన్నది తేలడం లేదు. పదిమంది పోయారనని సరిపెట్టుకోవడానికి కూడా లేదు. గతంలో టిఆర్ఎస్ ఆడిన విధంగానే కాంగ్రెస్ కూడగా పాచిలు వేస్తోంది. బిఆర్ఎస్‌ను బొందపెట్టడమే లక్ష్యంగ కాంగ్రెస్ బిజెపిలు పావులు కదుపుతున్నాయి. ఎందుకంటే ఇప్పటికే అనేకమంది బిఆర్ఎస్‌ను వీడి అధికార కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఎమ్మెల్యేలు జారుకుంటున్నారు. అధికారంలో లేకున్నా ఎపిలో విపక్షంగా టిడిపి ఉన్నా బలంగా నిలబడి తిరిగి అధికారం దక్కించుకుంది. పదేళ్లు అధికారంలో ఉన్నా కుటుంబ పాలన వల్ల బిఆర్ఎస్ అధికారం కోల్పోయింది. అనేక అక్రమాలను మూటకట్టుకుంది. అవే ఇప్పుడు యమపాశాలై వెన్నాడుతున్నాయి. ఓటమి తరవాత ఇక్కడ బిఆర్ఎస్, ఎపిలో వైసిపి ఒకే తరహా డ్రామాలు ఆడుతున్నాయి. ఎమ్మెల్యేలను లేదా ఎంపిలను లేదా క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను చేర్చుకోవడంలో తెలంగాణలో పోటీ కేవలం కాంగ్రెస్, బిజెపిల మధ్యనే ఉంది. ఈ రెండు పార్టీలు ఆధిపత్యం లక్ష్యంగా పెట్టుకుని పోరాడుతున్నాయి. దీంతో విపక్ష బిఆర్ఎస్‌లో చేరేందుకు ఎవరు కూడా ముందుకు రావడం లేదు. పదేళ్లు అధికారంలో ఉన్న పార్టీ ఇంతగా ప్రజల్లో ఆదరణ కోల్పోవడం కేవలం బిఆర్ఎస్‌లో మాత్రమే కనిపిస్తోంది. ఈ క్రమంలో వచ్చే స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ అత్యధిక సర్పంచ్ సీట్లు గెలిస్తేనే.రాజకీయంగా నిలుస్తుంది. అందుకే మైండ్ గేమ్ ఆడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా బీఆర్ఎస్ చతికిల బడటం, కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న ప్రచారం, ఎమ్మెల్సీ కవిత మద్యం కుంభకోణంలో జైలుకు వెళ్లడం, ముఖ్యనేతలు అనుకున్న వారంతా కారు దిగి హస్తం పార్టీలోకో, బీజేపీ గూటికో చేరడం వంటి పరిణామాలతో గులాబీ పార్టీ ఉక్కిరి బిక్కిరి అవుతోంది. దీంతో పార్టీ క్యాడర్లో జోష్ నింపేందుకు కేసీఆర్ రంగంలోకి దిగాలని కోరుకుంటున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో కీలకంగా వ్యవహ రిస్తారని అంతా అనుకున్నారు. కానీ అలాంటిదేమీ జరగలేదు. అసెంబ్లీ ద్వారా వచ్చిన అవకాశాన్ని కెసిఆర్ వదులుకున్నారు. రైతుల పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని చెప్పేందుకు జిల్లా యాత్రలు చేపట్టి. రైతులను పరామర్శించినా లాభ ం లేకుండా పోయింది. ఇప్పుడు రు-ణమాఫీతో రైతుల్లో మళ్లీ కాంగ్రెస్ పట్ల ఆదరణ పెరగింది. బీఆర్ఎస్ పార్టీతోనే రైతులకు లాభం జరుగుతుందని కెసిఆర్ ఎన్నికల ముందు యాత్ర ద్వారా చెప్పే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. పార్లమెంట్ ఎన్నికల తరవాత మాతో 20మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని బీరాలు పలికి 10 మంది ఎమ్మెల్యేలను అప్పగించింది. అందుకే కెసిఆర్ తనముందున్న అన్ని అస్త్రాలను ఉపయోగించాలని చూస్తున్నారు. అయితే ఇప్పటికిప్పుడు బిఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. కాంగ్రెస్ పార్టీ గెలుపు అంతా సీఎం రేవంత్ రెడ్డి తన భుజాల మీద వేసుకుని 8 ఎంపి స్థానాలు గెలుచుకున్నారు. బిఆర్ఎస్‌ను పూర్తిగా దెబ్బతీసేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. మరో జాతీయ పార్టీ బీజేపీకి మళ్లీ మోదీ క్రేజీ గెలుపు తో దూకుడు మీద ఉంది. అయితే ఆ పార్టీలో కూడా అధ్యక్ష పదవి కోసం ఇప్పుడు కుమ్ములాటలు సాగుతున్నాయి. గులాబీ పార్టీని నిలుపుకునేందుకు మాజీ సీఎం ఆ పార్టీ అధినేత కేసీఆర్ రంగంలోకి దిగుతారని అనుకుంటున్నా..ఆయన సైలెంట్‌గా ఉన్నారు. ఈ క్రమంలో బిఆర్ఎస్ బిజెపిలో విలీనం అవుతుందన్న ప్రచారం కూడా దెబ్బతీస్తోంది. దీని కోసం అన్ని పార్టీలు మైండ్ గేమ్ స్టార్ట్ చేశాయి. ప్రత్యర్థి పార్టీ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారంటూ కాంగ్రెస్ మంత్రులు వ్యాఖ్యలు చేస్తున్నారు. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుందని బిజెపి, బిఆర్ఎస్‌లు ప్రచారం చేస్తున్నా అది పెద్దగా ప్రజలు పట్టించుకునే స్తాయిలో లేదు. స్థానిక ఎన్నికల తర్వాత బిఆర్ఎస్ పార్టీ ఉనికి కోల్పోతుందని జోస్యం చెబుతోంది. అయితే ఈ మూడు పార్టీలు తమదైన శైలిలో మానసిక యుద్ధానికి తెర లేపాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 64 స్థానాలు గెల్చుకోగా, మిత్రపక్షం సీపీఐ ఒక స్థానంలో గెలిచింది. దీనికితోడు సిఎం రేవంత్‌రెడ్డి తీరుపై సానుకూల దృక్పథం రోజురోజుకూ బలపడుతోంది. అన్నింటికి మించి దొరల పానలకు దూరంగా ఉంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో చెక్ పెట్టిన బీఆర్ఎస్ మళ్లీ కోలుకోకుండా ఉండేందుకు ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టింది. సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కింది స్థాయి బీఆర్ఎస్ క్యాడర్ లక్ష్యంగా ఈ ఆపరేషన్ సాగుతోంది. తెలంగాణలో తమ ప్రధాన ప్రత్యర్థి బీజేపీనే తప్ప బీఆర్ఎస్ కాదని నేతలు చెబుతున్నారు. బిజెపి కూడా కాంగ్రెస్ తమ ప్రదాన ప్రత్యర్థిగా చెబుతోంది. అందుకే ఈ రెండు పార్టీలు బిఆర్ఎస్ లక్ష్యంగా విమర్శలకు పదను పెట్టాయి. బీఆర్ఎస్ దుకాణం బంద్ అవుతుందని, దాదాపు 25 మంది ఎమ్మెల్యేలు కారు దిగడం ఖాయమని ప్రచారం సాగుతోంది. బీఆర్ఎస్ లో నలుగురు మాత్రమే ఉంటారని, మిగతా వారంతా బయటకు రావడం ఖాయమని గులాబీ నేతలను మానసికంగా కృంగదీసేలా మంత్రులు తమ వ్యాఖ్యలు ముమ్మరం చేస్తున్నారు. ఏది ఏమైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందా.. ఊడుతుందా అంటూ...పొలిటికల్ మైండ్ గేమ్‌తో అధికార కాంగ్రెస్‌ను డిఫెన్స్‌లోకి నెట్టేందుకు కమలం నేతలు కామెంట్స్ చేస్తున్నారు.

# మునుపటి ఛరిష్మా మళ్లీ వచ్చేనా

## బిఆర్ఎస్‌లో ఆవరించిన నిస్తేజం

హైదరాబాద్,ఆగస్ట్ 13 : రానున్న స్థానిక ఎన్నికల్లో గెలిస్తేనే..బిఆర్ఎస్ నిలుస్తుంది. లేకుంటే ఇప్పుడున్న పరిస్థితి కన్నా దారుణంగా ఉంటుంది. పార్టీలో ఉండేవారు ఉండరు. ప్రధాన నేతలు జారుకుంటారు. అందుకే కెసిఆర్ మారోమారు రంగంలోకి దిగాలని కేబర్ కోరరుకుంటోంది. ఉద్యమం నాటి కెసిఆర్‌ను చూస్తారని అంటున్నా..ఆయన పెద్దగా కదిలి రావడం లేదు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉండదని, ఎన్నికల తరవాత గందరగోళం ఏర్పడుతుందని అంటున్నారు. 39 అసెంబ్లీ స్థానాలు గెలవడంతో ఈ దఫా పార్లమెంట్ ఎన్నికల్లో కూడా విజయం సాధిస్తామన్న అంచనాలు తలకిందులు అయ్యాయి. దీంతో కారు క్యాడర్‌లో నిరూత్సాహం ఆవహించింది. దాన్ని పోగొట్టే ప్రయత్నంలో కేసీఆర్ పలు మీటింగ్‌లు పెట్టినా పెద్దగా ఫలితం రావడం లేదు. ఈ క్రమంలోనే స్థానిక ఎన్నికల తర్వాత రాష్ట్రంలో గందరగోళ రాజకీయాలు ఉంటాయని ఛోటామోటా నేతలు కార్యకర్తలకు సర్దిచెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూలే సూచనలు ఉన్నట్లు చెపుతున్నారు. 104 మంది ఎమ్మెల్యేలు ఉంటేనే బీజేపీ తన ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం చేసిందని, 64 స్థానాలున్న కాంగ్రెస్ ను కూల్చడం పెద్ద కష్టం కాదని సూత్రీకరిస్తున్నారు. కేటీఆర్, హరీశ్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు లాంటి నేతలు కొద్ది రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుందని, రేవంత్ రెడ్డిబీజేపీలో చేరడం ఖాయమని ప్రచారం చేసారు. ఇదంతా చూస్తుంటే పార్టీ క్యాడర్ ను , లీడర్లను కాపాడుకోవడంతో పాటు కార్యకర్తలను కాపాడుకునే వ్యూహంతోనే బీఆర్ఎస్ నేతలు ఈ మైండ్ గేమ్ కు సిద్ధమయినట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో గెలవడానికి ఎలాంటి అస్త్రలనైనా ఉపయోగించేందుకు రాజకీయ పార్టీలు వెనుకాడవు. అయితే కాంగ్రెస్ పార్టీ కూలుతుందని బీజేపీ-బీఆర్ఎస్ నేతలు చెప్పడం రానున్న రోజుల్లో ఈ రెండు పార్టీల మైత్రికి ఇదేమైనా నాందియా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. బీజేపీకి ప్రధాన శత్రువు జాతీయ స్థాయిలో కాంగ్రెస్ మాత్రమే. బీఆర్ఎస్ జాతీయ పార్టీగా రిజిస్టర్ అయినా దాని ప్రభావం జాతీయ రాజకీయాల్లో ఏ మాత్రం లేదు. కాబట్టి దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ కన్నా ప్రాంతీయ పార్టీలు ఉంటేనే బీజేపీకి లాభం. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు- మిత్రులు ఉండరన్న నానుడి బీజేపీ- బీఆర్ఎస్ కు వర్తిస్తుంది. అదే రీతిలో శత్రువు-శత్రువు మిత్రువు అన్న నానుడి కూడా ఈ రెండు పార్టీలకు వర్తిస్తుంది. ఎందుకంటే.. జాతీయ స్థాయిలో బీజేపీకి శత్రువు కాంగ్రెస్, రాష్ట్రస్థాయిలో బీఆర్ఎస్ కు శత్రువు కాంగ్రెస్. ఈ సూత్రం ప్రకారం... బీజేపీ- బీఆర్ఎస్ లు రానున్న రోజుల్లో కాంగ్రెస్ ను గద్దె దింపే ప్రయత్నాలు చేసే అవకాశం లేకపోలేదు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను ఈ రెండు పార్టీలు చేర్చుకుంటాయా లేక, బీఆర్ఎస్,బీజేపీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ చేర్చుకుని కౌంటర్ ఎటాక్ చేస్తుందా... అన్నది మాత్రం వేచిచూడాల్సిందే. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని పదేళ్ల తమ పాలనలో తీసుకున్న చర్యలను వివరిస్తూ, ప్రజల్లోకి వెళ్లేలా ప్రచార కార్యక్రమాలను బిఆర్ఎస్ సిద్ధం చేస్తోంది. ప్రజల్ని మళ్లీ ఉద్యమ స్థాయిలో సిద్ధం చేయాలని కేసీఆర్ పట్టుదలగా ఉన్నారు.

మళ్లీ ఉద్యమ కేసీఆర్ ÷-ను చూపిస్తానని కేసీఆర్ గతంలో ప్రకటన కూడా చేశారు. ఇకపోతే తాను జనాలను కలవదలుచుకున్నపుడు మాత్రమే కేసీయార్ పర్యటనలు చేసేవారు. అంతేకాని జనాల సమస్యలను దృష్టిలో పెట్టుకుని పర్యటించింది చాలా తక్కువ. విపత్తుల సమయంలో కూడా పార్టీ వర్కింగ్ ప్రెసిడింట్, మాజీమంత్రులు కేటీయార్, హరీష్ రావులే పరామర్శించేవారు. వరంగల్, ఖమ్మం జిల్లాల్లో పత్తిరైతులు గిట్టుబాటు ధరలకోసం ఆందోళనచేస్తే ఎవరూ పట్టించుకోలేదు. కామారెడ్డి మున్సిపల్ మాస్టర్ ప్లాన్ సహా అనేక అంశాల్లో ప్రజల ఆందోళనలను ఎప్పుడూ పట్టించుకోలేదు. బహింగసభల వల్ల ప్రయోజనం ఉండదని నేరుగా ప్రజల్ని కలవాలని అనుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని చూస్తుంటే బీఆర్ఎస్ అభ్యర్థులను జనాలు పట్టించుకుంటున్నట్లు లేదు. క్యాడర్ సహకారం లేకపోవడంతో నేతలు నిమిత్త మాత్రులుగా మగిలిపోతున్నారు. ఈ క్రమంలో బిఆర్ఎస్ నేతలు ఉంటారా జారుతారా అన్నది కూడా ప్రశ్నార్థకమే.

# తెలంగాణ మెడికల్ సీట్ల వ్యవహారం

### గడవువును 15 వరకు పొడిగించిన కాళోజీ వర్సిటీ

### హైకోర్టులో పిటిషన్ దాఖలు..విచారణ నేటికి వాయిదా

వరంగల్ఆగస్ట్ 13 : తెలంగాణలోని మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ (కాంపిటెంట్) కోటా కింద 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీకి వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ తొలి విడత కౌన్సెలింగ్ నోటిఫికేషన్‌ను ఆగస్టు 3న విడుదల చేసింది. ఆగస్టు 4న రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభంకాగా.. 4 నుంచి ఆగస్టు 13తో గడువు ముగియాల్సి ఉంది. అయితే ఈ గడువును మరో రెండు రోజులు పెంచుతున్నట్లు కాళోజీ వర్సిటీ రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు. నీట్ యూజీ రాష్ట్రస్థాయి ర్యాంకులకు ఎంపికైన అభ్యర్థులు ఆగస్టు 15న సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేసుకోవచ్చు. -ూష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో మెడికల్, డెంటల్ కోర్సుల్లో అడ్మిషన్లకు స్థానికత వివాదం మళ్లీ హైకోర్టుకు చేరింది. నిబంధనలను సవరిస్తూ రూల్-3ఎను చేర్చిన ప్రభుత్వం.. జులై 19న జీవో నెంబరు 33ను జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే దీన్ని సవాలు చేస్తూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. మరికొందరు అత్యవసరంగా లంచ్ మోషన్‌లో విచారణ చేపట్టాలని కోరారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. గతేడాది హైకోర్టు వెలువరించిన తీర్పునకు విరుద్ధంగా ప్రభుత్వం నిబంధనలను సవరిస్తూ జీవో తీసుకువచ్చిందని కోర్టుకు తెలిపారు. ప్రస్తుత నిబంధన ప్రకారం మెడికల్ సీట్ల ప్రవేశాలకు ముందు వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదివి ఉండాలని నిబంధన తీసుకువచ్చారన్నారు. సవరణ వల్ల స్థానికులకే తీవ్ర నష్టం వాటిల్లుతుందని వాదించారు. మెడికల్, డెంటల్ కోర్సుల్లో అడ్మిషన్ల నిమిత్తం దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 13 చివరి తేదీ అని, అత్యవసరంగా విచారణ చేపట్టాలని కోరారు. వాదనలను విన్న ధర్మాసనం ప్రతివాదుల వాదన వినకుండా ఉత్తర్వులు ఇవ్వలేమని పేర్కొంది. ప్రతివాదులైన వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి, కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ, ఎన్‌టీఏలకు నోటీసులు జారీ చేస్తూ విచారణను 14కు వాయిదా వేసింది. జీవో 33పై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ గడువును కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ఆగస్టు 15 వరకు పొడిగించింది. ఎంబీబీఎస్ వెబ్‌కౌన్సెలింగ్‌లకు సంబంధించి కాళోజీ వర్సిటీ విడుదల చేసిన అభ్యర్థుల మెరిట్ జాబితాలో ఎంపికైనవారు మాత్రమే వెబ్‌కౌన్సెలింగ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. మెరిట్ జాబితాకు ఎంపికైన అభ్యర్థులందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. తెలంగాణలోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ రాష్ట్ర స్థాయి ర్యాంకులను ప్రకటించిన సంగతి తెలిసిందే. మొత్తం 49,143 మంది ర్యాంకులను ప్రకటించింది.

# ఆర్థిక అభివృద్ది పేరుతో వంచన

### ఆదానీ వ్యవహారంపై నోరుమెదపని నేతలు

### పదేళ్లుగా తీవ్ర ఆర్థిక ఒడిదుడుకుల్లో జనం

న్యూఢిల్లీ,ఆగస్ట్13 : వికసిత భారత్ లక్ష్యంగా పదేళ్లుగా మోడీ నేతృత్వంలోని బిజెపి పాలన సాగించారు. గత 20 ఏళ్ల కాలానికి పోలిస్తే దేశంలో అభివృద్ది అన్నది ఎండమావి అన్న విమర్శలు ఉన్నాయి. కార్పోరేట్లకే బిజెపి అనుకూలం అన్న ప్రచారం కూడా బలంగా ఉంది. ఆదానీ, అంబానీల సేవలె మునిగిపోయారనన్న విమర్శలు బలపడుతున్నాయి. తాజాగా ఆదానీ, సెబీ వ్యవహారంపై దుమారం రేగుతోంది. జెపిసి విచారణకు విపక్షాలు డిమాండ చేస్తున్నాయి. అయితే ఈ వ్యవహారాన్ని పెద్దగా పట్టించుకున్నట్లుగా కనిపించడం లేదు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సంస్కరణలు ఫలితాలిస్తాయని ఆశించారు. దేశ ప్రజలు భవిష్యత్‌పై ఆశతో ఉన్నారు. పేదలకు ఉచిత రేషన్ ఇస్తున్నామంటేనే..ప్రజల కొనుగోలు శక్తి లేకుండా పోయిందని గుర్తించడం లేదు. దాదాపు 80 కోట్ల మంది దీని వల్ల లబ్ది పొందారని గర్వంగా చెప్పుకోవడం సిగ్గుచేటు.. రైతులకు కనీస మద్దతు ధరలు అన్నవి రావడం లేదు. కానీ బియ్యం, ఉప్పు,పప్పుల ధరలు మాత్రం ఏటికేడు ఆకాశాన్ని అంటుతున్నాయి. అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం అని వివరించడం అందంగా మోసగించడం తప్ప మరోటి కాదు. దేశంలో ఎన్నో సమస్యలు పరిష్కరించడం వేరు..కానీ పేదలు, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వం అండలేకుండానే జీవించగలగాలి. కానీ ఈ పదేళ్లలో అలాంటి అవకాశాలు లేకుండా చేశాయి.

వికసిత భారత్ పేరుతో పంద్రాగస్ట్ వేడుకలుకు ప్రధాని మోడీ సిద్ధం అవుతున్నారు. పేదల అభివృద్ధే దేశ అభివృద్ధి. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందంటే వారు బాగుపడ్డ దాఖలాలు కనబడాలి. 80 కోట్ల మందికి ఫ్రీ రేషన్‌తో ఆహార సమస్య తీరిందని పేర్కొనడంతోనే దేశం ఏ మేరకు అభివృద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చు. గ్రామీణ ప్రజల ఆర్థిక వికాసం సాధ్యం అవుతోందని చెప్పకుండా ఉంటే బాగుండేది. కోట్లాది మంది రైతులకు నేరుగా నగదు బదిలీ చేస్తున్నా మంటేనే వారికి తగిన గిట్టుబాటు ధరలు, వ్యవసాయ పనిముట్లు అందడం లేదని అర్థం చేసుకోవాలి. ఇన్ని సమస్యలను చర్చించకుండా బడ్జెట్‌లో అంతా బాగుందని చెప్పడం ద్వారా భారత్ వెలిగిపోతోందని అంటే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరని గుర్తించాలి. అయితే పాలకులు సామాన్యులు బతకడమెలా అన్నది ఆలోచించడం లేదు. సామాన్యుడు తనకుతానుగా బతకగలిగినప్పుడే నిజమైన అభివృద్ధికి గీటురాయిగా చూడాలి. వచ్చే ఐదేళ్లలో భారత్ అద్భుతమైన ప్రగతి సాధించబోతుందని మోదీ సహా నేతలంతా పేర్కొనడం చూస్తే..దేశం మరో ఐదేళ్లపాటు వేచి చూడాలన్నమాట. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడ మే లక్ష్యంగా పనిచేస్తున్నామంటున్నారు. అప్పటికి వందేళ్ల స్వాతంత్ర్య భారతం అవుతుంది. గత పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం అని మోదీ చెప్పారు. అలాగే 80 కోట్ల మందికి ఉచిత రేషన్ అందిస్తున్నామని చెప్పారు. నిజానికి అభివృద్ధి జరిగివుంటే ఈ దుస్థితి ఎందుకని ప్రశ్నించుకోవాలి. ప్రజలు తిండిగింజలను కొనుక్కునే పరిస్థితిలో లేరని చెప్పకనే చెప్పారు. పేద మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కాల ఎండమావిగా మారింది. పేదలు, మహిళలు, యువకులు, రైతులపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదు. అంతెందుకు జిఎస్టీ అన్నది ప్రజల రక్తామాంసాలను పీల్చి పిప్పి చేస్తోంది. జిఎస్టీ వసూళ్లు నెలకు లక్షా 40 వేల కోట్ల వసూళ్లను చూసి అభివృద్ధి అనుకుంటున్నారు. కానీ అదంతా ప్రజలను జలగల్లా పీల్చి వసూలు చేస్తున్న డబ్బుగా చూడడం లేదు. ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు కట్టలేని దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. సామాన్యులు ఇల్లు కొనుక్కునే పరిస్థితి లేదు. బ్యాంక్ వడ్డీ రేట్లు దారుణంగా ఉన్నాయి. భూములు, సిమెంట్, స్టీలు ధరలను అద్దం పెట్టుకుని బిల్డర్లు దోపిడీ చేస్తున్నారు. హైదరాబాద్ లాంటి నగరంలో కోటిన్నర లేనిదే ఓ అపార్ట్‌మెంట్ రావడం లేదంటే ఇది అభివృద్ధి అవుతుందా.. లేక సామాన్యులకు ఇల్లు అందుబాటులో లేకపోవడమా అన్నది ఆలోచన చేయాలి. ఇందులో జిఎస్టీ పదినుంచి 12 లక్షలు, రిజిస్ట్రేషన్‌కు ఓ పది లక్షలు కట్టాలంటే ఎంత భారం పడుతుందో ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. బడ్జెట్ పద్దులు ప్రజలను ఆదుకునేలా ఉండాలి. అందమైన ఎసి గదుల్లో కూర్చుని ఆలోచిస్తే ఎన్నటికీ అంటే 2047 నాటికి కూడా ప్రజల బతుకులు బాగుపడవని గుర్తించాలి. సామాజిక న్యాయం కేవలం రాజకీయ నినాదంగా మాత్రమే ఉండేదని,కానీ, మేం దాన్ని అమలు చేసి చూపుతున్నాం. సామాజిక రుగ్మతగా మారిన వ్యవస్థీకృత అసమానతలను రూపుమాపుతున్నాం అన్న పదాలు వినడానికి బాగానే ఉంటాయి. గత పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక గుణాత్మక మార్పులు వచ్చాయని చంకలు గుద్దుకోవడంతో సరిపుచ్చితే మార్పు రాదు. పీఎం ఫసల్ బీమా యోజన కింద నాలుగు కోట్ల మంది రైతులకు పంట బీమా సాయం అందుతోందని బడ్జెట్‌లో చెప్పారు. నిజానికి దేశంలో ఎక్కడ ఎలాంటి పంటలు పండుతున్నాయి. వాటికి ఎంత ఖర్చవుతుంది. రైతులు ఏంకోరుకుంటున్నారన్న చర్చ చేయడం లేదు. వ్యవసాయ చట్టాలు

ఎత్తేశాక వాటి గురించి చర్చించడం లేదు. పన్ను వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ట్యాక్స్ చెల్లింపుదారుల సంఖ్య పెరిగింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల పొదుపులు, పెట్టుబడులకు భద్రత ఏర్పడిందంటున్నారు. నిజానికి ఇదొక్కటే దేశాన్ని, ప్రజలను అగాధం లోకి నెట్టుతోందని ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చిందన్న మాటలు శుద్ద అబద్దం. ఆర్థిక వ్యవస్థ బలోపేతమై ప్రజలకు ఉపాధి లభించేలా ప్రజా ప్రయోజనాల కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు రూపొందించాల్సి ఉంది. బ్యాంకులను సంస్కరించాల్సిన అవసరం ఉంది.



# విశాఖ స్థానిక ఎమ్మెల్సీ పోటీకి దూరం

**కూటమి నేతలతో చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్**

**బాబు నిర్ణయాన్ని స్వాగతించిన జనసేన, బిజెపి**

అమరావతి,ఆగస్ట్ 13 : విశాఖపట్నం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి దూరంగా ఉండనుంది. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయంతో పోటీకి దూరంగా కూటమి నేతలు ఉండనున్నారు. మంగళవారం నాడు టెలికాన్ఫరెన్స్‌లో తన అభిప్రాయాన్ని కూటమి నేతలకు చంద్రబాబు తెలిపారు. చంద్రబాబు అత్యంత హూందాగా వ్యవహరించారని కూటమి నేతలు కొనియాడారు. అధికారంలో ఉండి... గెలిచే అవకాశం ఉన్నా రాజనీతిజ్ఞుడిలా చంద్రబాబు వ్యవహరించారని నేతలు ప్రశంసలు కురిపించారు. గెలవాలంటే పెద్ద కష్టం కాదు...కానీ హూందా రాజకీయాలు చేద్దామని నేతలతో అన్నారు. చంద్రబాబు నిర్ణయాన్ని కూటమి పక్షనేతలు, జిల్లా నేతలు ఆమోదించారు. నాటి స్థానిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వ అక్రమాల కారణంగా నాడు ఎన్నికల్లో పోటీకి దూరంగా టీడీపీ ఉందని చెప్పారు. అధికార మార్పిడి తర్వాత స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున కూటమి వైపు వచ్చారని వివరించారు. గెలుపు కాదు ప్రజల అభిప్రాయలు, విలువలు ముఖ్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వం ముందున్న లక్ష్యం రాష్ట్ర పునర్నిర్మాణం అన్నివర్గాల అభివృద్ధి అని చంద్రబాబు ఈ సమావేశంలో కూటమి నేతలకు చంద్రబాబు తెలిపారు. మరోవైపు.. ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పోటీచేయరాదని టీడీపీ అధినాయకత్వం నిర్ణయించింది. టీడీపీ కూటమి పక్షాల బలం పరిమితంగా ఉండటంతో ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. జీవీఎంసీ కార్పొరేటర్లు, నర్సీపట్నం, యలమంచిలి మున్సిపల్ కౌన్సిలర్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ఇందులో ఓటర్లు. వీరిలో 60 శాతానికిపైగా వైసీపీ నుంచి గెలిచిన వారే. పోటీ పెడితే.. గెలిపిస్తామని కొందరు టీడీపీ ఎమ్మెల్యేలు ముందుకు వచ్చినా.. అంత ప్రయాస పడి గెలవాల్సిన అవసరం లేదని నాయకత్వం భావించింది. ఒక ఎమ్మెల్సీ సీటు కోసం అంతమందిని ప్రత్యర్థి పార్టీ నుంచి సమీకరించాల్సిన అవసరం లేదని, దాని వల్ల వచ్చే ప్రయోజనం కూడా లేదని అభిప్రాయపడినట్లు సమాచారం. నామినేషన్ల దాఖలుకు మంగళవారం చివరి రోజు. వైసీపీ అభ్యర్థి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ నామినేషన్ సక్రమమని తేలితే ఆయన ఎన్నిక ఏకగ్రీవమవుతుంది. స్థానిక సంస్థల కోటాలో ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్సీ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మూడు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. సోమవారం ఆయన రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌కు సమర్పించారు. అనంతరం ఆయన
విలేకరులతో మాట్లాడుతూ బలం లేదని తెలిసి కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని నిలబెడితే దుశ్చర్య అవుతుందని వ్యాఖ్యానించారు. మొత్తం 838 ఓట్లలో వైసీపీకి 530 ఓట్లు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి అరకు ఎంపీ తనూజరాణి, నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్, కురసాల కన్నబాబు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ తదితరులు హాజరయ్యారు. పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి కలెక్టరేట్ ప్రధాన ద్వారం వరకు వచ్చి నాయకులను కలిసి వెళ్లిపోయారు. స్వతంత్ర అభ్యర్థిగా షేక్ సఫీ నామినేషన్ వేశారు.

## శోభిత,నాగచైతన్యలపై విడాకుల కామెంట్స్

**జ్యోతిష్యుడు వేణుస్వామికి షాక్.. 22న హాజరు కావాలంటూ నోటీసులు**

హైదరాబాద్,ఆగస్ట్13 : ప్రముఖ జ్యోతిష్యుడు వేణుస్వామికి తెలంగాణ మహిళా కమిషన్ మంగళవారం నోటీసులు జారీ చేసింది. ఈ నెల 22న మహిళా కమిషన్ ఎదుట హాజరు కావాలని ఆదేశించింది. నాగచైతన్య, శోభిత ధూళిపాళ విడిపోతారంటూ చేసిన వ్యాఖ్యలపై నోటీసులు ఇచ్చింది. మరోవైపు వేణుస్వామికి మద్దతుగా ఆయన భార్య వీణా వాణి వీడియో విడుదల చేసింది. మీడియాపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవల నాగచైతన్య, శోభిత ధూళిపాళ నిశ్చితార్థం చేసుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత వేణుస్వామి జాతకాలను విశ్లేషణ చేస్తూ చేసిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యింది. 2027లో ఇద్దరు విడిపోతారంటూ వ్యాఖ్యానించారు. గతంలో సమంత, నాగ చైతన్య జంట సైతం విడిపోతారంటూ బయటపెట్టారు. ఆ తర్వాత పలు విషయాలపై జాతకాలు చెప్పినా ఏ ఒక్కటి జరుగలేదు. ఇదిలా ఉండగా.. వేణుస్వామిపై చర్యలు తీసుకోవాలంటూ తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశాయి. గతంలో సినిమాల విడుదల, రాజకీయాలు ఇలాంటి వ్యాఖ్యలు చేసి అభాసుపాలైనా ఆయనకు బుద్ధి రాలేదని.. వ్యక్తిగత విషయాలపై నలుగురిలో మాట్లాడకూడదనే జ్ఞానం లేకుండా వేణుస్వామి వాళ్లు విడిపోతారంటూ వ్యాఖ్యానిస్తున్నారని విమర్శించారు. దీనికి స్పందించిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద వేణుస్వామిని పిలిపించి వివరణ కోరుతామని పేర్కొన్నారు. టెలికాస్ట్ చేసిన యూట్యూబ్ ఛానెల్స్‌పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలోనే వేణుస్వామికి మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసింది.

## ఎందరో నేతల పోరాట ఫలితం ఇది

**తిరంగా యాత్రను ప్రారంభించిన పురంధేశ్వరి**

అమరావతి,ఆగస్ట్ 13 : నేటి స్వాతంత్ర్య ఫలాలు ఆనాటి నేతల పోరాట ఫలితమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. స్వాతంత్ర్య చరిత్ర భవిష్యత్ తరాలకు తెలియచేయాలన్నారు. బీజేపీ ఎన్డీఏ పక్షాల భాగస్వామ్యంతో తిరంగా యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా యాత్రను బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ.. దేశమంతా విద్యార్థులతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతి యావత్తు ఒక పండుగ వాతావరణంలో నిర్వహించుకోవాలని అన్నారు. పార్టీలకు అతీతంగా దేశమంతా జాతీయ జెండాను ప్రతి ఇంటిపైన ఆవిష్కరించుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి తిరంగా యాత్ర గురించి వివరించామన్నారు. జాతీయ జెండా చేత బూని తిరంగా యాత్రలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని పురందేశ్వరి వెల్లడించారు. రోవైపు ఈరోజు ఢిల్లీలోనూ తిరంగా యాత్ర చేమనున్నారు. భారత మండపం నుంచి ధ్యాన్‌చంద్ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. తిరంగా యాత్రలో పలువురు ఎంపీలు పాల్గొననున్నారు. ఆగస్టు 9 నుంచి 15 వరకు ప్రతి ఇంట్లో త్రివర్ణ పతాకం ప్రదర్శించాలని... మువ్వన్నెల జెండాతో సెల్ఫీలను అప్‌లోడ్ చేసేందుకు వెబ్ సైట్ ను ఏర్పాటు చేశారు. 2022 నుంచి ఈ వెబ్‌సైట్ అందుబాటులో ఉంది. 2022లో 6 కోట్లు, 2023లో 10 కోట్ల మంది సెల్ఫీల అప్‌లోడ్ చేశారు. ఇప్పటికే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ డిస్‌ప్లే పిక్చర్‌ను మార్చి త్రివర్ణ పతాకాన్ని పెట్టారు. నేడు జరిగే త్రివర్ణ బైక్ ర్యాలీలో పాల్గొనాలని దేశంలోని ఎంపీలందరినీ కేంద్ర ప్రభుత్వం కోరింది. నేటి త్రివర్ణ బైక్ ర్యాలీలో పాల్గొనాలని అన్ని పార్టీల ఎంపీలకు విజ్ఞప్తి చేసింది.ఇది రాజకీయాలకు అతీతమైన అంశమని కేంద్రం పేర్కొంది. గతేడాది 23 కోట్ల ఇళ్లలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసినట్లు కేంద్రం పేర్కొంది.

## కాకినాడ పోర్టు అడ్డాగా అక్రమంగా బియ్యం తరలింపు

**తనిఖీల్లో 26వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని స్వాధీనం**

**నోటీసులు ఇచ్చి బాధ్యులను అరెస్ట్ చేయిస్తాం**

**ఎంతటి వారైనా వదలబోమన్న మంత్రి నాదెండ్ల**

కాకినాడ,ఆగస్ట్ 13 : పౌరసరఫరాల శాఖను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని ఎపి పౌరసరఫరాల శాఖ మంత్రి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వైకాపా పాలనలో ఓ కుటుంబం కాకినాడ పోర్టును అడ్డాగా మార్చుకొని, రేషన్ బియ్యం అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. కాకినాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్‌లో నిర్వహించిన తనిఖీల్లో 26వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. రేషన్ బియ్యం అక్రమాల కేసులో విచారణ కొలిక్కి వచ్చిందని తెలిపారు. ఈ కేసులో ఎంతటి వారున్నా వదిలే ప్రసక్తే లేదని, చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాకినాడ పోర్టు ఏర్పాటు చేసింది ఓ కుటుంబం కోసం కాదు.. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ కోసం. ఈ ప్రాంతానికి పెట్టుబడులు రావాలన్న ఉద్దేశంతోనే పోర్టును ఏర్పాటు చేశారు. కానీ, గత ఐదేళ్లలో ఇక్కడికి ఇతరులెవరూ రాకుండా వైకాపా నేతలు హుకుం జారీ చేసి, అక్రమాలకు పాల్పడ్డారు. మీడియా ప్రతినిధులకు అనుమతి లేకుండా చేశారు. ఇక్కడి రేషన్ బియ్యాన్ని.. నూకలు, ఉప్పుడు బియ్యం పేరుతో రీ ప్యాకింగ్ చేసి విదేశాలకు ఎగుమతి చేశారు. అక్రమాలకు పాల్పడిన వారెవ్వరినీ వదలం.. చట్టప్రకారం కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకుంటాం. త్వరలోనే 41ఏ ద్వారా నోటీసులిచ్చి అరెస్టు చేస్తాం. కాకినాడ పోర్టులో పని చేస్తున్న ఉద్యోగులు, హమాలీల సమస్యలను పరిష్కరిస్తాం' అని నాదెండ్ల తెలిపారు. అక్రమ రేషన్ బియ్యం రవాణా కాకినాడ పోర్టు ద్వారా జరిగిందని ఈ వ్యవహారంలో త్వరలో అరెస్టులుంటాయని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఉభయ గోదావరి జిల్లాల పర్యటనలో భాగంగా మంగళవారం కాకినాడలో మంత్రి మనోహర్ పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పౌరఫరాలశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ విలేకరులతో మాట్లాడుతూ త్వరలోనే 41ఎ నిబంధన కింద నోటీసులు ఇచ్చి రేషన్ బియ్యం అక్రమ తరలింపు చేసిన వారిని అరెస్టు చేస్తామన్నారు. ఇప్పటికే 6ఎ కింద నోటీసులు ఇచ్చి క్రిమినల్ కేసులను వారిపై నమోదు చేశామన్నారు. కాకినాడ పోర్టును రేషన్ బియ్యం అక్రమాలకు అడ్డాగా మార్చుకుని ఊహించని విధంగా గత ప్రభుత్వంలో రేషన్ బియ్యం అక్రమ తరలింపు జరిగిందని తెలిపారు. ఈ వ్యవహారమంతా ఒకే కుటుంబం కనుసన్నల్లోనే కార్యకలాపాలు నడిచాయని మంత్రి ఆరోపించారు. అనధికార కార్యక్రమాలు ఆగాలని ప్రభుత్వం భావిస్తుందని అందువల్ల చెక్ పోస్ట్ దగ్గర ఇబ్బందులు లేకుండా అదనపు సిబ్బందిని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అవసరం అయితే మరిన్ని చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశం అనంతరం పోర్టులో జరిగే కార్యక్రమాలను సందర్శించేందుకు మంత్రి నాదెండ్ల మనోహర్ వెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వర రావు (కొండబాబు), పౌర సరఫరాలశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీతారామతో ఉమ్మడి జిల్లాలో గోదావరి గలగలలు

**15న వైరాలో భారీగా సిఎం రేవంత్ సభ**

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి**

ఖమ్మం,ఆగస్ట్ 13 : గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం చేయాలనే సీతారామ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గత ప్రభుత్వం 8 వేల కోట్లతో నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ పంప్ హౌస్ మోటార్లు పాడవకుండా సద్వినియోగం కోసం తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.సీఎం రేవంత్ రెడ్డి వైరా బహిరంగ సభ సన్నాహక సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ... ఆగస్ట్ 15న వైరాలో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ విజయవంతం చేయాలన్నారు. ఖమ్మం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన సమీక్షించారు. రైతాంగం తలరాత మార్చే సభగా వైరా సభ నిలవనుందని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో ఖమ్మం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. 'నా జీవిత కోరిక సీతారామతో తీరింది' అని అన్నారు. దక్షిణ అయోధ్యకు రైల్వేలైన్ రాబోతుందని.. త్వరలో కొత్తగూడెం విమానాశ్రయం రాబోతుందని వెల్లడించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి చేస్తామన్నారు. కాంగ్రెస్ పాలనలోనే భద్రాచలం అభివృద్ధి పూర్తి స్థాయిలో చేస్తామన్నారు. రాజకీయ అసూయతో చేసే విమర్శలను తాను పట్టించుకోనని స్పష్టం చేశారు. రాజకీయ వేధింపులు అరాచకం తన జీవితంలో లేవన్నారు. రాజకీయ విరోధులైన జలగం వెంగళరావు, రజబ్ అలీ ఇతర నేతలను వ్యక్తిగతంగా విమర్శ చేయలేదన్నారు. తాను చేసిన అభివృద్ధి పనులు పార్టీలకతీతంగా స్వాగతిస్తున్నారన్నారు. పదవులు శాశ్వతం కాదని... చేసిన పనులే చరిత్రలో నిలుస్తాయన్నారు. ప్రజల కోసం పనిచేసే నాయకులు ఏ పార్టీలో ఉన్నా అభిమానిస్తాం తప్ప వ్యక్తిగత విమర్శలు చేయనని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

## గురుకుల బాట పట్టిన మంత్రులు

**ప్రభుత్వం మొద్దునిద్ర వీడిందన్న కెటిఆర్**

హైదరాబాద్,ఆగస్ట్ 13 : రాష్ట్రంలో గురుకులాల పనితీరు, పరిశుభ్రతపై పార్టీ ఆధ్వర్యంలో కమిటీ వేస్తామన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటనతో ప్రభుత్వంలో చలనం వచ్చిందని బిఆర్ఎస్ ప్రకటించుకుంది. ఇప్పటికే ప్రభుత్వ యంత్రాంగం ప్రభుత్వ హాస్టళ్ల బాటపట్టింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ జగిత్యాల జిల్లా పెద్దాపూర్ గురుకుల హాస్టల్‌కు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ స్పందిస్తూ.. గురుకుల స్కూళ్ల సమస్యలపై మొద్దు నిద్రలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొన్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. 8నెలల్లో కలుషిత ఆహారంతో 500 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారు. తాజాగా బీబీపేట పాఠశాలలో 24 మంది విద్యార్థులు అస్వస్థతకు లోనయ్యారు. ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన భోజన వసతి కల్పించాలి. పాఠశాలల్లో వసతులు, సమస్యలను పరిష్కరించాలని కేటీఆర్ కోరారు. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1000కు పైగా గురుకులాల్లో ప్రాణనష్టం జరగకుండా.. ఆహార నాణ్యతను మెరుగుపరిచేందుకు డిప్యూటీ సీఎం, ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నానని కేటీఆర్ ట్వీట్ చేశారు.

## అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై 3 నెలల నిషేధం

***గతంలో అక్రమంగా భూములను కొట్టేసిన వైసిపి నేతలు***

***రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి***

అమరావతి,ఆగస్ట్13 : ఒరిజనల్ అసైనీలకు లబ్ది చేకూర్చేందుకే ఫ్రీ హోల్డ్ చేసిన అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లను మూడు నెలల పాటు నిలిపివేసినట్లు రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు కుట్ర పూరితంగా ఎస్సీ, ఎస్టీల అసైన్డ్ భూములను చౌకగా కొట్టేశారని మండిపడ్డారు. అసైన్డ్ చట్టానికి సవరణ వస్తుందని ముందే తెలుసుకొని వైసీపీ నేతలు ఒరిజనల్ అసైనీల నుంచి అతి తక్కువ ధరలకే భూములను కొనేశారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా అనర్హులకు అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేశారన్నారు. కొన్ని ప్రభుత్వ భూములను కూడా నిషేధిత జాబితా నుంచి ఫ్రీ హోల్డ్ చేశారన్నారు. ప్రజా అవసరాలకు ఉంచిన ప్రభుత్వ భూములను ఫ్రీ హోల్డ్ చేసి రిజిస్ట్రేషన్లు చేశారని తెలిపారు. రిజిస్టర్ అయిన అసైన్డ్ భూముల్లో కొన్ని నిబంధనలకు విరుద్ధంగా గిఫ్ట్ డీడ్లుగా చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 10 ఏళ్ల పరిమితి దాటని భూములను కూడా ఫ్రీ హోల్డ్ చేసినట్లు సమాచారముందన్నారు. ఫ్రీ హోల్డ్ వ్యవహారంలో జరిగిన తప్పులన్నింటీని సరిచేసేందుకే మూడు నెలల పాటు రిజిస్ట్రేషన్లను నిలిపివేసినట్లు స్పష్టం చేశారు. ఒరిజనల్ అసైనీలకు వందకు వంద శాతం పూర్తి న్యాయం చేస్తామన్నారు. ఫ్రీ హోల్డ్ పేరుతో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు ఉంటాయని మంత్రి అనగాని సత్యప్రసాద్ హెచ్చరించారు.

## అగ్రిగోల్డ్ భూముల కొనుగోలు వ్యవహారం

**జోగి రమేశ్ కుమారుడు జోగి రాజీవ్ తదితరుల అరెస్ట్**

**అగ్రిగోల్డ్ యాజమాన్యం ఫిర్యాదుతో కదిలిని ఎసిబి**



అమరావతి,ఆగస్ట్ 13 : అగ్రిగోల్డ్ భూముల కొనుగోలు వ్యవహారం కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ కుమారుడు జోగి రాజీవ్‌ను ఏసీబీ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ కేసులో ఆయన నిందితుడిగా ఉండడంతో అదుపులోకి తీసుకున్నారు. కాగా ఈ కేసులో కొందరు నిందితులు ఉన్నారు. 1. జోగి రాజీవ్, 2. జోగి సోదరుడు వెంకటేశ్వరరావు, 3. అడుసుమిల్లి మోహన రంగ దాసు, 4. వెంకట సీతామహాలక్ష్మీ, 5. సర్వేయర్ దేదీప్య 6. మండల సర్వేయర్ రమేశ్, 7. డిప్యూటీ తహశీల్దార్ విజయ్ కుమార్, 8. విజయవాడ రూరల్ ఎమ్మార్వో జాహ్నవి, 9. విజయవాడ రిజిస్ట్రార్ నాగేశ్వరరావులు ఈ జాబితాలో ఉన్నారని అధికారులు తెలిపారు. కాగా మిగతా వారిని పోలీసులు త్వరలో విచారించే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్ బండారం బహిర్గతమవుతోంది. ఏసీబీ మరిన్ని వివరాలు సేకరిస్తుండడంతో జోగి కుమారుడు మెడకు ఉచ్చు బిగిస్తోంది. కాగా విజయవాడ రూరల్ మండలంలోని అంబాపురంలో అగ్రిగోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారంలో జోగి కుటుంబం అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆయన అక్రమాలపై ఏడాది క్రితం అగ్రిగోల్డ్ యాజమాన్యం ఫిర్యాదు చేసినప్పటికీ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేసులో కదలిక వచ్చింది. అంబాపురంలో సర్వే నెం. 88లోని 2160 గజాల అగ్రిగోల్డ్ స్థలాన్ని సీఐడీ గతంలోనే అటాచ్ చేసింది. వేరేవారి పేరుపై నకిలీ రిజిస్ట్రేషన్ చేసి మళ్లీ తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు జోగి రమేశ్ కుట్ర చేసినట్లు రెవెన్యూ నివేదికలో తేటతెల్లమైంది. వేరే వారి దగ్గర నుంచి ఈ స్థలాన్ని జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్, జోగి సోదరుడు వెంకటేశ్వరరావు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మళ్లీ ఈ స్థలాన్ని విజయవాడకు చెందిన వేరే వారికి అమ్మేశారు. ఈ విషయంలో తమ పేరు బయటకు రాకుండా జాగ్రత్తపడ్డారు. ఈ మొత్తం వ్యవహారంలో అప్పటి మంత్రి జోగి రమేష్ ఉన్నారని అధికారులు చెబుతున్నారు. మొత్తం రూ. 7 కోట్లు విలువైన స్థలం కబ్జా అయినట్లు అధికారులు లెక్క తేల్చారు. కాగా సీఐడీ తనఖాలో ఉన్న స్థలాన్ని ఎలా రిజిస్ట్రేషన్ చేశారనే అంశంపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. కాగా మాజీ మంత్రి జోగి రమేష్ ఈరోజు (మంగళవారం) సాయంత్రం మంగళగిరి డీఎస్పీ ఆఫీసులో విచారణకు హాజరుకానున్నారు. చంద్రబాబు నివాసంపై దాడి కేసులో విచారణకు రావాలని పోలీసుల నోటీసులు ఇచ్చారు. కాగా మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత జోగి రమేష్ ఇంట్లో ఏసీబీ సోదాలు చేస్తోంది. ఇబ్రహీంపట్నంలోని రమేష్ నివాసంలో మంగళవారం తెల్లవారుజామున 15 మంది
అధికారుల బృందం రంగంలోకి దిగి సోదాలు చేపట్టింది. రమేష్ ఇంట్లో ఉన్న కీలక డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అగ్రిగోల్డ్ భూముల విషయంలో జోగి రమేష్‌పై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. చాలామంది బాధితులు ఆయనపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. మంత్రిగా ఉన్న సమయంలో అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు అధికారుల దృష్టికి రావడంతో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నట్లు సమాచారం.

## ఎసిబి నుంచి ఎవ్వరూ తప్పించుకోలేరు

***లంచం తీసుకోవాలంటేనే వణుకు పుట్టాలి : ఎసిబి డిజి సివి ఆనంద్ ట్వీట్***

హైదరాబాద్,ఆగస్ట్ 13 : అవినీతికి పాల్పడే అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఏసీబీ నుంచి తప్పించుకోలేరని తెలంగాణ ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. లంచం తీసుకుంటామనే ఆలోచన రాకుండా పని చేస్తున్నామని అన్నారు. ఎవరైనా లంచం అడిగితే నిర్భయంగా తెలియ చేయాలని అన్నారు. గత రాత్రి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు చెందిన జాయింట్ కలెక్టర్ భూపాల్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్ రెడ్డి రూ.8 లక్షలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు చిక్కిన విషయాన్ని షేర్ చేస్తూ ఎక్స్ ఖాతాలో సీవీ ఆనంద్ ట్వీట్ చేశారు. 14 గుంటల భూమిని ధరణి పోర్టల్‌లో నిషేధిత భూముల జాబితా నుండి తొలగించుటకుగాను సీనియర్ అసిస్టెంట్ లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డారు. తదుపరి ఆ మొత్తాన్ని జాయింట్ కలెక్టర్‌కు అందచేశారు. ఫిర్యాదుదారుని నుండి నగర శివార్లలో డబ్బు తీసుకోవటం.. ఆపై క్షఫీఫీ దగ్గర జాయింట్ కలెక్టర్‌కు అందేలా జాగ్రత్త తీసుకున్నప్పటికీ, ఎసిబి టీమ్ రాత్రంతా ఎంతో చాకచక్యంగా అప్పటికప్పుడు ప్రణాళికలు మార్పు చేసుకుంటూ ఇద్దరిని ట్రాప్ చేశారని సీవీ ఆనంద్ ట్వీట్‌లో పేర్కొన్నారు. ధరణి వెబ్‌సైట్‌లోని నిషేధిత జాబితా నుంచి తన భూమిని తొలగించాలని జక్కిడి ముత్యంరెడ్డి అనే రైతు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్ రెడ్డిని కోరారు. అయితే ఈ పనిచేసేందుకు ఆయన రూ.8 లక్షలు డిమాండ్ చేశారు. దీంతో రైతు ముత్యంరెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పథకం ప్రకారం.. ఆ మొత్తాన్ని సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్ రెడ్డి తీసుకుంటుండగా పట్టుకున్నారు. సీనియర్ అసిస్టెంట్‌ను అధికారులు విచారించగా జేసీ భూపాల్‌రెడ్డి చెబితేనే డబ్బులు తీసుకున్నానని అధికారులకు చెప్పారు. వెంటనే జేసీకి అతనితో ఫోన్ చేయించారు. పెద్దఅంబర్‌పేట ఓఆర్ఆర్ వద్దకు ఆ డబ్బును తీసుకురావాలని చెప్పాడు. దీంతో మదన్‌మోహన్‌తోపాటు అక్కడికి వెళ్లిన ఏసీ బీ అధికారులు.. అతని నుంచి డబ్బులు తీసుకుని తన కారులో పెట్టుకుంటుండగా జేసీ భూపాల్ రెడ్డిని పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసిన అనంతరం.. ఇరువురి నివాసాల్లో సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో నాగోల్‌లోని భూపాల్ రెడ్డి ఇంట్లో రూ.16 లక్షల నగదు, కీలకమైన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

## ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా తయారీ

***20నుండి బీఎల్వోల ద్వారా ఇంటింటి సర్వే***

***జిల్లా కలెక్టర్ డా.జి. సృజన.***

విజయవాడ,ఆగస్ట్ 13 : ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ తయారీలో భాగంగా బీఎల్వోల ద్వారా ఇంటింటి ఓటర్ జాబితా సర్వే నిర్వహించాలని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయం అమరావతి నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్ఓలతో మంగళవారం సీఈవో వివేక్ యాదవ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ నుండి కలెక్టర్ డా.జి. సృజన, డిఆర్వో వి. శ్రీనివాసరావు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎం. దుర్గాప్రసాద్ హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ లో వివేక్ యాదవ్ మాట్లాడుతూ 2025, జనవరి 1 అర్హత తేదీతో చేపట్టే ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందించేందుకు ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు బీఎల్వోలు ఇంటింటి ఓటర్ల సర్వే ప్రక్రియ నిర్వహించాలన్నారు.

## అగ్రిగోల్డ్ భూములపై బహిరంగ చర్చకు సిద్ధం

**కావాలనే మావాడిని కేసులో ఇరికించి అరెస్ట్ చేశారు**

**రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందన్న మాజీ మంత్రి జోగి**

విజయవాడ,ఆగస్ట్ 13 : ఏపీలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని మాజీ మంత్రి జోగి రమేష్ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 'మా అబ్బాయి ఎటువంటి తప్పు చేయలేదు. అగ్రిగోల్డ్ భూముల విషయంపై బహిరంగ చర్చకు సిద్ధం. మా కుటుంబం ప్రమేయం ఉన్నట్లు నిరూపిస్తే ఎటువంటి చర్యలకు అయినా సిద్ధం. మా వాడు విదేశాల్లో చదువుకుని ఇక్కడకు వచ్చాడు. చంద్రబాబు రాజకీయాలకు మా వాడిని బలి చేస్తున్నారు. మీకు, మీ ఇంట్లో పిల్లలు ఉన్నారనేది గుర్తు ఉంచుకోండని అన్నారు. ఇక్కడితో అయిపోదు.. మాకు కూడా సమయం వస్తుందని ఆయన అన్నారు. చంద్రబాబు అక్రమ కేసులతో వేధిస్తే భయపడమని స్పష్టం చేశారు. ఆనాడు కూడా జగన్మోహన్ రెడ్డిని టీడీపీ వాళ్లు బూతులు తిట్టారని.. ఆ అంశాలను చంద్రబాబుకు వివరించడానికే వాళ్ల ఇంటికి వెళ్లానని తెలిపారు. దానిని దాడిగా చిత్రీకరించి అడ్డుకున్నారన్నారు. తప్పకుండా న్యాయం గెలుస్తుందన్నారు. మావాడి పాత్ర లేదని రుజువు అవుతుంది అని జోగి రమేష్ స్పష్టం చేశారు. కాగా... అగ్రిగోల్డ్ భూముల కొనుగోలు వ్యవహారం కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ కుమారుడు జోగి రాజీవ్‌ను ఏసీబీఅధికారులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ కేసులో ఆయన నిందితుడిగా ఉండడంతో అదుపులోకి తీసుకున్నారు

## ట్రైనీ వైద్యురాలి హత్యాచార కేసు

**వెలుగులోకి షికింగ్ విషయాలు.. ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రికి ఫోన్**

**పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

కోల్‌కతా,ఆగస్ట్ 13 : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ –హాస్పిటల్‌లో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం, హత్య కేసులో తాజాగా మరికొన్ని షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. గురువారం రాత్రి హత్య జరగగా.. శుక్రవారం ఉదయం వైద్యురాలి తండ్రికి కాల్ చేసి సమాచారం అందించారు. అయితే కాల్ చేసిన వ్యక్తి 'మీ కూతురు ఆత్మహత్య చేసుకుంది' అని చెప్పాడంటూ వైద్యురాలి తండ్రి చెప్పారు. వెంటనే ఆసుపత్రికి వెళ్లి చూడగా సెమినార్ హాల్‌లో సగం బట్టలు, గాయాలతో తన కూతురు నిర్జీవంగా ఉందని ఆయన వివరించారు. ఈ మేరకు పోలీసుల విచారణలో ఆయన వెల్లడించారు.'మెడిసిన్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అంటూ ఫోన్ చేశారు. మీ కూతురు ఆత్మహత్య చేసుకొని చనిపోయింది. ఆ తర్వాత మేము ఆసుపత్రికి చేరుకున్నప్పుడు వాస్తవం ఏంటో తెలుసుకున్నాం' అని మీడియాకు వెల్లడించారు. సదరు అధికారి తన పేరు చెప్పలేదని అని పేర్కొన్నారు. మెడికల్ కాలేజీ యాజమాన్యం అసలు విషయాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నించిందని ఆయన ఆరోపించారు. కాగా పోలీసు విచారణ ప్రకారం.. వైద్యురాలు గురువారం రాత్రి డ్యూటీలో ఉన్నారు. హత్యకు ముందు మరో నలుగురు తోటి వైద్యులతో కలిసి డిన్నర్ చేశారు. దీంతో ఆమెతో డిన్నర్ చేసిన వ్యక్తులతో కూడా మాట్లాడి మరిన్ని వివరాలు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇక ఆసుపత్రికి చేరుకున్న తర్వాత కూడా మృతదేహాన్ని చూసేందుకు అనుమతించలేదని వైద్యురాలి తల్లి మీడియాతో చెప్పారు. ' నా కూతుర్ని చూడనివ్వాలని వాళ్ల కాళ్ల మీద పడ్డాను. అయినా చూడనివ్వలేదు. మధ్యాహ్నం 2 గంటలకు నా కూతురిని చూసేందుకు అనుమతి ఇచ్చారు' ఆమె వాపోయారు. కాగా హత్యకు ముందు గురువారం రాత్రి వైద్యురాలు తన తల్లికి ఫోన్ చేసిందని, అన్నం తిని పడుకోమని చెప్పిందని కుటుంబ సభ్యులు చెప్పారు. అంతలోనే రాత్రి ఈ ఘోరం జరిగిపోయిందని వివరించారు. వచ్చే ఏడాది ఆమెకు పెళ్లి చేయాలనుకు న్నామని వివరించారు. కాగా ఆత్మహత్య చేసుకొని చనిపోయిందని కుటుంబ సభ్యులకు ఎందుకు చెప్పారో తెలుసుకునేందుకు ఆసుపత్రిలోని ఛాతీ వైద్య విభాగం అసిస్టెంట్ సూపరింటెండెంట్, విభాగాధిపతిని పోలీసులు పిలిచి విచారించారు. ఆసుపత్రికి తరచూ వచ్చే సంజయ్ రాయ్ అనే వలంటీర్‌ను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. ఈ ఘటనలో ఇతరులు ఎవరికైనా ప్రమేయం ఉంటే నాలుగైదు రోజుల్లో కస్టడీలోకి తీసుకుంటామని పోలీసులు చెప్పారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం 14
ఆగస్టు 2024





## జ20 బంతుల్లో 5 వికెట్లు..

ఇంగ్లండ్‌లో జరిగిన హండ్రెడ్ లీగ్‌లో న్యూజిలాండ్ పేసర్ టిమ్ సౌథీ మెరుపు దాడితో అందరి దృష్టిని ఆకర్షించాడు. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో బర్మింగ్‌హామ్ ఫీనిక్స్, ట్రెంట్ రాకెట్స్ తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ట్రెంట్ రాకెట్స్ జట్టు టిమ్ సౌథీ ధాటికి తడబడింది. డేంజరస్ బౌలింగ్‌తో దాడి చేసిన టిమ్ సౌథీ కేవలం 20 బంతుల్లో 13 డాట్ బాల్స్ వేశాడు. 12 పరుగులు మాత్రమే ఇచ్చి 5 వికెట్లు కూడా తీశాడు. సౌథీ గట్టి ధాటికి ట్రెంట్ రాకెట్స్ జట్టు 100 బంతుల్లో 118 పరుగులు చేసింది. 119 పరుగుల సులువైన లక్ష్యంతో బరిలోకి దిగిన బర్మింగ్‌హామ్ ఫీనిక్స్ తరపున ఓపెనర్ బెన్ డకెట్ 30 పరుగులు చేయగా, లియామ్ లివింగ్‌స్టోన్ 30 పరుగులతో అజేయంగా నిలిచాడు. జాకబ్ బెతెల్ 93 బంతుల్లో అజేయంగా 38 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. దీంతో బర్మింగ్‌హామ్ జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ ఓటమితో ట్రెంట్ రాకెట్స్ జట్టు హండ్రెడ్ లీగ్ నుంచి నిష్క్రమించింది. ఇప్పటి వరకు ట్రెంట్ రాకెట్ 7 మ్యాచ్‌లు ఆడగా 3 మ్యాచ్‌లు గెలిచి 4 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. దీని ద్వారా, 2024 హండ్రెడ్ లీగ్ నాకౌట్ దశకు చేరుకోవడంలో విఫలమైంది.

**ఇరు జట్లు:**
ట్రెంట్ రాకెట్స్ టామ్ బాంటన్ (కీపర్), అలెక్స్ హేల్స్, జో రూట్, టామ్ అల్సోప్, రోవ్‌మన్ పావెల్, ఇమాద్ వాసిమ్, లూయిస్ గ్రెగొరీ(కెప్టెన్), క్రిస్ గ్రీన్, జాన్ టర్నర్, ల్యూక్ వుడ్, సామ్ కుక్.
బర్మింగ్‌హామ్ ఫీనిక్స్ : బెన్ డకెట్, మోయిన్ అలీ(కెప్టెన్), జామీ స్మిత్(కీపర్), లియామ్ లివింగ్‌స్టోన్, డాన్ మౌస్లీ, జాకబ్ బెథెల్, బెన్నీ హొవెల్, సీన్ అబాట్, ఆడమ్ మిల్నే, టిమ్ సౌతీ, క్రిస్ వుడ్.

## భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో మరిన్ని పతకాలు సాధించాలి

పారిస్ ఒలింపిక్స్ 2024లో దేశ పతాకధారిగా నిలవడం గర్వించదగ్గ విషయమని పిస్టల్ షూటర్ మను భాకర్ అన్నారు. పారిస్‌లో రెండు పతకాలు సాధించిన భారత పిస్టల్ షూటర్ మను భాకర్ ఒలింపిక్స్‌లో మరిన్ని పతకాలపై కన్నేసింది. పతకాలు సాధించేందుకు తాను ఎంతో కష్టపడ్డానని చెప్పారు. భవిష్యత్తులో తాను ఒకే ఒలింపిక్స్‌లో రెండు కంటే ఎక్కువ పతకాలు సాధించగలిగితే అది గొప్ప అని పేర్కొన్నారు. కష్టపడి పనిచేస్తే.. భవిష్యత్తులో మరింత మెరుగైన ప్రదర్శన చూపించగలం.. తద్వారా భవిష్యత్తులో భారత్‌కు మరిన్ని ఒలింపిక్ పతకాలు సాధించాలని కోరుకుంటున్నానని మను భాకర్ చెప్పారు. 22 ఏళ్ల మను ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారతీయురాలిగా నిలిచింది. ఆమె మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత.. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లలో సరబ్‌జోత్ సింగ్‌తో కలిసి కాంస్య పతకాలను సాధించింది. ఆమె 25 మీటర్ల పిస్టల్‌లో స్వల్ప తేడాతో కాంస్యం గెలుచుకోలేకపోయింది. కాగా.. పారిస్ ఒలింపిక్స్ ముగింపు వేడుకలో వెటరన్ హాకీ గోల్ కీపర్ పిఆర్ శ్రీజేష్‌తో కలిసి మను భారతదేశ పతాకధారిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మను భాకర్ మాట్లాడుతూ.. "ఇది జీవితంలో ఒకసారి జరిగే అనుభవం" అని చెప్పింది. దీనిని తాను ఎప్పటికీ గుర్తుంచుకుంటానని తెలిపింది. శ్రీజేష్ భయ్యాతో తనకు చాలా మంచి అనుబంధం ఉందని.. ఆయన తనకు చిన్నప్పటి నుంచి తెలుసని చెప్పారు.. అతను చాలా స్నేహపూర్వకంగా, సహాయకారిగా.. మర్యాదగా ఉంటాడని పేర్కొంది. అలాగే పారిస్ ఒలింపిక్స్ ముగింపు కార్యక్రమంలో శ్రీజేష్ తనకు మంచి సపోర్ట్ అందించాడని చెప్పుకొచ్చింది. ఇదిలా ఉంటే.. మను భాకర్ మూడు నెలల విరామం తీసుకోవాలని నిర్ణయించుకుంది. దీంతో ఆమె అక్టోబర్‌లో జరగనున్న ప్రపంచకప్‌కు దూరంగా ఉంటుంది. ఆమె కోచ్ జస్పాల్ రాణా మాట్లాడుతూ.. ఆమె మూడు నెలల విరామం తీసుకుంటున్నందున అక్టోబర్‌లో జరిగే ప్రపంచకప్‌లో ఆడే అవకాశం లేదన్నారు. ఆమె చాలా కాలంగా కష్టపడుతోంది కాబట్టి ఇది సాధారణ విరామం అని అన్నారు. కాగా.. అక్టోబర్ 13 నుంచి 18 వరకు ఢిల్లీలో షూటింగ్ ప్రపంచకప్ జరగనుంది. అయితే.. 2026లో జరిగే ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొంటుందని జస్పాల్ తెలిపారు.

## కోహ్లీ రూ. 30 కోట్లకు పైగా అమ్ముడుపోతాడు

### వేలం నిర్వాహకుడు హ్యూ ఎడ్మిడెస్ కీలక వ్యాఖ్యలు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో చాలాసార్లు వేలం నిర్వహించిన ప్రముఖ వేలం నిర్వాహకుడు హ్యూ ఎడ్మిడెస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రపున ఆడుతున్న విరాట్ కోహ్లీ 2025 ఐపీఎల్ వేలంలోకి వస్తే.. అతను ఈజీగా 30 కోట్ల రూపాయలకు పైగా పొందగలడని హ్యూ ఎడ్మిడెస్ చెప్పారు. కాగా.. విరాట్ కోహ్లీ తన కెరీర్ ప్రారంభం నుండి ఐపీఎల్‌లో ఆర్సీబీ తరపున ఆడుతున్నాడు. ఆ జట్టు కూడా అతనిని ప్రతీసారి రిటైన్ చేసుకుంటుంది. కాగా.. విరాట్ కోహ్లీ ఇప్పటి వరకు వేలంలో పాల్గొనలేదు. ఐపీఎల్ 2008లో కూడా అతన్ని %ఖ%19 డ్రాఫ్ట్ నుండి ఆర్సీబీ సొంతం చేసుకుంది. అప్పటి నుండి.. అతను ఆర్సీబీ తరుపునే ఆడుతున్నాడు. ఫ్రాంచైజీ కూడా అతనిని వదిలిపెట్టడం లేదు. అయితే.. 17 సీజన్లలో ఆ జట్టు ఒక్క టైటిల్ కూడా సాధించలేకపోయింది. కానీ ఇప్పటికీ జట్టు విరాట్ కోహ్లీపై నమ్మకం ఉంచుకుంది. ఇప్పటివరకూ ఆర్సీబీ ఇతర ప్లేయర్లను వదిలేసినా.. విరాట్‌ను అస్సలు వదిలిపెట్టలేదు. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు కూడా ఆర్సీబీ విరాట్‌ను రిటైన్ చేస్తుంది. క్రిక్‌బ్లాగ్‌కి చెందిన అరవింద్ కృష్ణన్‌తో హ్యూ ఎడ్మిడెస్ మాట్లాడుతూ.. విరాట్ కోహ్లీ వేలంలోకి వస్తే అతను రూ. 30 కోట్లకు పైగా పొందగలడని చెప్పారు. 'విరాట్ కోహ్లీని వేలంలో ఉంచడం అతిపెద్ద గౌరవంగా భావిస్తున్నానని.. ధరను బట్టి చూస్తే రూ. 30 కోట్లకు పైగా పలుకుతాడని భావిస్తున్నాను'. అని అన్నారు. ప్రస్తుతం ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా విరాట్ కోహ్లీ నిలిచాడు. లీగ్ చరిత్రలో 8000 పరుగులు చేసిన తొలి బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ 38.67 స్ట్రైక్ రేట్‌తో 132 పరుగులతో 8004 పరుగులు చేశాడు. టోర్నీ చరిత్రలో విరాట్ 7 సెంచరీలు, 55 హాఫ్ సెంచరీలు సాధించాడు.

# వినేశ్ పిటిషన్‌పై తీర్పు మళ్లీ వాయిదా

## ఈనెల 16న నిర్ణయం



న్యూఢిల్లీ: స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్‌కు రజత పతకం దక్కేనా? లేదా? అనే ఉత్కంఠతో సోమవారం భారత క్రీడాభిమానులంతా అత్యంత ఆసక్తిగా ఎదురుచూశారు. ముందుగా ప్రకటించిన సమయం ప్ర కారం రాత్రి 9.30 గంటలకు కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (కాస్) ఎలాంటి తీర్పునివ్వబోతోందోనన్న ఆత్రుత అందరిలోనూ కనిపించింది. కానీ తీరా ఆ సమయానికి తుది తీర్పు మరోసారి వాయిదా పడిందన్న నిర్ణయం రావడంతో అంతా ఉసూరుమన్నారు. తాజాగా ఈనెల 16న వినేశ్ అనర్హత విషయమై కాస్ తుది తీర్పునివ్వబోతోంది. ఈ వ్యవహారంపై ఇప్పటికే వాదనలు పూర్తయినప్పటికీ నిర్ణయం వెల్లడించేందుకు మాత్రం ఆలస్యమవుతోంది. పారిస్ ఒలింపిక్స్‌లో వినేశ్ మహిళల 50కేజీ విభాగం ఫైనల్‌కు చేరిన విషయం తెలిసిందే. కానీ సరిగ్గా పోటీలకు ముందు తన బరువు 100 గ్రాములు ఎక్కువగా ఉండడంతో డిస్క్వాలిఫై కావడం అందరినీ షాక్‌కు గురిచేసింది.
దీంతో దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తం కావడంతో పాటు భారత ఒలింపిక్ సంఘం కూడా వెంటనే ఈ విషయాన్ని కాస్‌లో అప్పీల్ చేసింది. వినేశ్‌కు కనీసం రజతమైనా ఇవ్వాలనే డిమాండ్ వినిపించింది. అయితే తన పిటిషన్‌పై గేమ్స్ ముగింపు రోజు 11న తీర్పు వస్తుందని ఆశించినా.. అది సోమవారానికి వాయిదా పడింది. ప్రస్తుత నిర్ణయంతో మరో రెండ్రోజులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకవేళ కాస్ తీసుకునే నిర్ణయం వినేశ్‌కు అనుకూలంగా వస్తే భారత్ ఖాతాలో రెండో రజతం చేరుతుంది.

## భారత్‌కు రాకుండా.. జర్మనీ వెళ్లిన నీరజ్ చోప్రా!



భారత స్టార్ జావెలిన్ త్రోయర్, గోల్డెన్ బాయ్ నీరజ్ చోప్రా పారిస్ ఒలింపిక్స్ 2024లో రజత పతకం సాధించిన విషయం తెలిసిందే. పారిస్ ఒలింపిక్స్ పోటీలు ఆదివారం ముగియగా.. నీరజ్ స్వదేశానికి రాకుండా జర్మనీకి వెళ్లాడు. ఈ విషయాన్ని భారత ఒలింపిక్ అసోసియేషన్ వర్గాలు ధ్రువీకరించాయి. నీరజ్ జర్మనీకి వెళ్లాడని.. కనీసం మరో 45 రోజుల వరకు భారత్‌కు తిరిగి వచ్చే అవకాశం లేదని అతని కుటుంబీకులు ఒకరు తెలిపారు. తన గాయానికి శస్త్రచికిత్సకు సంబంధించి వైద్య సలహా తీసుకోవడానికి, డైమండ్ లీగ్‌ల్లో పాల్గొనాలా? వద్దా? అని నిర్ణయించుకోవడానికి జర్మనీ వెళ్లినట్లు తెలుస్తోంది. 'నీరజ్ చోప్రా పారిస్ నుంచి జర్మనీ వెళ్లాడు. మరో 45 రోజుల వరకు అతడు భారత్‌కు వచ్చే అవకాశం లేదు. నాకు పూర్తి వివరాలు వివరాలు తెలియదు గానీ.. వైద్యుడిని సంప్రదించడానికి అక్కడికి వెళ్లాడు. నీరజ్ కండిషన్‌ను బట్టి డైమండ్ లీగ్‌ల్లో పాల్గొనాలా? వద్దా అనేది కోచ్, ఫిజియో నిర్ణయిస్తారు' అని జావెలిన్ త్రోయర్ నీరజ్ కుటుంబీకులు ఒకరు తెలిపారు. గతంలో కూడా గాయం గురించి జర్మనీలోని వైద్యుడిని నీరజ్ సంప్రదించాడు. పారిస్ ఒలింపిక్స్‌కు ముందు కొన్నిరోజులు అక్కడి సార్‌బ్రూకెన్‌లో శిక్షణ పొందాడు. డైమండ్ లీగ్ ఫైనల్ సెప్టెంబర్ 14న బెల్జియంలోని బ్రసెల్స్‌లో జరగనుంది.
...

## లెజెండరీ క్రికెటర్‌ది సహజ మరణం కాదు..

### అసలు విషయం చెప్పేసిన సతీమణి!

ఇంగ్లండ్ లెజెండరీ క్రికెటర్ గ్రాహం థోర్ప్ ఇటీవల కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆగష్టు 5న అనారోగ్య సమస్యలతో థోర్ప్ చనిపోయారని ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) పేర్కొంది. అయితే థోర్ప్ అనారోగ్య కారణాలతో మరణించలేదని, ఆత్మహత్య చేసుకున్నారని ఆయన సతీమణి అమండా తాజాగా చెప్పారు. అనారోగ్య సమస్యలు తన కుటుంబానికి ఇబ్బందిగా మారాయని భావించి బలవన్మరణానికి పాల్పడ్డారని వెల్లడించారు. గత శనివారం ఫర్న్‌హామ్ క్రికెట్ క్లబ్, చిప్‌స్టెడ్ క్రికెట్ క్లబ్ మధ్య మ్యాచ్ ప్రారంభానికి ముందు గ్రాహం థోర్ప్ జ్ఞాపకార్థం ఓ వేడుక నిర్వహించారు. ఈ వేడుకకి థోర్ప్ భార్య అమండా.. కుమార్తెలు కిట్టి, ఎమ్మా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమండా మాట్లాడుతూ%ొ % 'గత రెండేళ్లుగా థోర్ప్ తీవ్ర మానసిక సమస్యలతో బాధపడ్డారు. మే 2022లో ఆత్మహత్యకు ప్రయత్నించారు. దాంతో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చాలా రోజులు ఉండాల్సి వచ్చింది. తాను ఎంతగానో ప్రేమించే భార్య, కూతుళ్లు ఉన్నప్పటికీ ఆయన కోలుకోలేకపోయారు. తన భార్య, పిల్లలు సుఖంగా ఉండాలని ఆత్మహత్య చేసుకున్నారు. చాలా బాధగా ఉంది' అని చెప్పారు. గ్రాహం థోర్ప్ 1993 నుంచి 2005 మధ్య ఇంగ్లండ్ తరపున 100 టెస్టులు, 82 వన్డేలు ఆడారు. టెస్టుల్లో 6744 రన్స్ చేశారు. ఇందులో 16 సెంచరీలు ఉండగా.. అత్యధిక వ్యక్తిగత స్కోర్ 200 నాటౌట్. వన్డేల్లో 2380 పరుగులు బాదారు. ఎడమచేతి వాటం బ్యాటర్ అయిన థోర్ప్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 341 మ్యాచ్‌ల్లో 21937 పరుగులు చేశారు. సగ్రేతో ఆయన 17 ఏళ్ల కెరీర్‌ను కొనసాగించారు.

## రూ. 15లకే ఆ మ్యాచ్ టికెట్లు..

### బంఫర్ ఆఫర్ ప్రకటించిన పీసీబీ

ఆగస్టు 21 నుంచి పాకిస్థాన్, బంగ్లాదేశ్ మధ్య టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. స్వదేశంలో జరిగే ఈ మ్యాచ్‌కు ప్రేక్షకులు లేకపోవడంతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఆందోళన చెందుతోంది. ఎందుకంటే గత ఏడాది కాలంగా పాకిస్థాన్ ఆటగాళ్ల మ్యాచ్ చూసేందుకు ప్రేక్షకులు ఆశించిన స్థాయిలో రావడం లేదు. అందుకే ఇప్పుడు టెస్ట్ మ్యాచ్‌ల టిక్కెట్ ధరను తగ్గించింది. ఆశ్చర్యకరంగా అది కూడా కేవలం రూ.15లకే టిక్కెట్లు ఇవ్వడం గమనార్హం. కరాచీ వేదికగా పాకిస్థాన్, బంగ్లాదేశ్ జట్ల మధ్య జరగనున్న టెస్టు మ్యాచ్ టిక్కెట్ ధరను ప్రకటించారు. ఇక్కడ సాధారణ టిక్కెట్ ధర రూ.15 మాత్రమే. 2024 పాకిస్తాన్ సూపర్ లీగ్ (%శూూ%) సమయంలో, స్టేడియంలలో ప్రేక్షకుల కొరత స్పష్టంగా కనిపించింది. ముఖ్యంగా ఎలిమినేటర్ లేదా ఫైనల్ మ్యాచ్‌లను చూసేందుకు అభిమానులు ఆశించిన స్థాయిలో రాలేదు. ఆసియా కప్‌లో కూడా ఖాళీ స్టేడియాలు కనిపించాయి. ఇక టెస్టు మ్యాచ్‌లకు ప్రేక్షకుల నుంచి ఆదరణ ఉండదని పీసీబీ ఆందోళన చెందుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు టిక్కెట్లను 50 పీకేఆర్ (భారత కరెన్సీలో రూ. 15లు)కి విక్రయించాలని నిర్ణయించింది. ఈ మ్యాచ్‌ల కోసం ఐదు రోజుల టిక్కెట్లను కొనుగోలు చేసే వారికి ప్రత్యేక తగ్గింపును కూడా ప్రకటించింది. దీని ప్రకారం, వారు పూర్తి ఐదు రోజులు క్రికెట్ చూడాలనుకుంటే, వారికి కేవలం రూ. 72 (పీకేఆర్ 215)కే పాస్‌ను అందిస్తున్నారు. దీని ద్వారా టెస్టు క్రికెట్‌కు ప్రేక్షకులను రప్పించేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ప్లాన్ చేసింది. దీని ప్రకారం బంగ్లాదేశ్–పాకిస్థాన్ జట్ల మధ్య జరిగే టెస్టు మ్యాచ్ సందర్భంగా స్టేడియం కిక్కిరిసిపోతుందో లేదో చూడాలి.
పాకిస్థాన్ టెస్టు జట్టు: షాన్ మసూద్ (కెప్టెన్), సౌద్ షకీల్ (వైస్ కెప్టెన్), అమీర్ జమాల్, అబ్దుల్లా షఫీక్, అబ్రార్ అహ్మద్, బాబర్ ఆజం, కమ్రాన్ గులాం, ఖుర్రం షాజాద్, మీర్ హమ్జా, మహ్మద్ అలీ, మహ్మద్ హురైరా, మహ్మద్ రిజ్వాన్ (వికెట్ కీపర్), నసీమ్ షా, సైమ్ అయూబ్, సల్మాన్ అలీ అఘా, సర్ఫరాజ్ అహ్మద్ (వికెట్ కీపర్), షాహీన్ అఫ్రిది.
బంగ్లాదేశ్ టెస్ట్ జట్టు: నజ్ముల్ హొస్సేన్ శాంటో (కెప్టెన్), మహ్మద్ హసన్ జాయ్, జకీర్ హసన్, షద్మాన్ ఇస్లాం, మోమినుల్ హక్, ముష్ఫికర్ రహీమ్, షకీబ్ అల్ హసన్, లిటన్ కుమార్ దాస్, మెహదీ హసన్ మిరాజ్, తైజుల్ ఇస్లాం, నయీమ్ హసన్, నహిద్ రానా, షోరీఫుల్ ఇస్లాం, హసన్ మహమూద్, హసన్ తస్కిన్ అహ్మద్, సయ్యద్ ఖలీద్ అహ్మద్.



## ‘ఈగల్’ బ్యూటీ గ్లామర్ డోస్ పెంచిందా..!

ఈ మాయ పేరేమిటో సినిమాతో హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన ముద్దుగుమ్మ కావ్య థాపర్. మొదటి సినిమా తో పెద్దగా గుర్తింపు రాకున్నా కూడా ప్రయత్నాలు ఆపలేదు. తమిళంలో ఈమె సినిమాలు వరుసగా చేస్తూ వచ్చింది. తెలుగు లో మరోసారి కావ్య థాపర్ కి ఏక్ మినీ కథ సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడం ద్వారా ఇండస్ట్రీ గుర్తింపు దక్కించుకుంది. అయితే ఆ సినిమా ఓటీటీ సినిమా అవ్వడం వల్ల రావాల్సిన ఆఫర్లు ఈ అమ్మడికి రాలేదు అనేది సినీ విశ్లేషకులు మరియు ఆమె సన్నిహితుల మాట. రవితేజ కు జోడీగా ఈగల్ సినిమాలో నటించే అవకాశంను ఈ అమ్మడు దక్కించుకుంది. తక్కువ సమయంలోనే టాలీవుడ్ లో పెద్ద హీరోతో నటించింది అనుకుంటున్న సమయంలోనే ఆ సినిమా ఫ్లాప్ అవ్వడంతో కాస్త నిరుత్సాహం కు గురి అయ్యింది. ఆ సినిమా తర్వాత టాలీవుడ్ లో ఆఫర్లు వస్తాయో లేదో అనుకుంటున్న సమయంలో అనూహ్యంగా డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో డబుల్ ఇస్మార్ట్ సినిమాలో రామ్ కు జోడీగా నటించే అవకాశాన్ని దక్కించుకున్నాడు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న డబుల్ ఇస్మార్ట్ సినిమాపై కావ్య థాపర్ ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తోంది. మిడిల్ క్లాస్ లవ్ చిత్రంతో హిందీలో అడుగు పెట్టిన ఈ అమ్మడికి ఆశించిన స్థాయిలో విజయం దక్కలేదు. కానీ తమిళంలో మాత్రం ఈ అమ్మడు పిచ్చైక్కారన్ 2 సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకుని అక్కడ వరుసగా ఆఫర్లు సొంతం చేసుకుంటుంది. టాలీవుడ్ మరియు కోలీవుడ్ లో సమాంతరంగా సినిమాలు చేస్తున్న కావ్య థాపర్ కి ముందు ముందు భారీ ఆఫర్లు తలుపు తట్టే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈమె డబుల్ ఇస్మార్ట్ ఫలితం పైనే అంతా ఆధారపడి ఉంటుంది అనే అభిప్రాయం ను నెటిజన్స్ వ్యక్తం చేస్తున్నారు.



## వయసు 50.. అందం 25

బాలీవుడ్ ప్రేక్షకులకు మలైకా అరోరా గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. నటిగానే కాకుండా మోడల్ గా, వీజే గా, నిర్మాతగా ఎన్నో విధాలుగా ఇండస్ట్రీలో సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న విషయం తెల్సిందే. చేసిన సినిమాలు తక్కువే అయినా కూడా ఇండస్ట్రీలో ఆమె గుర్తింపు స్టార్ హీరోయిన్స్ స్థాయి లో ఉంటుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. హీరోయిన్ గానే కాకుండా ఐటం సాంగ్స్ తో కూడా ఈ అమ్మడు మెప్పించింది. 1998 లో దిల్ సే సినిమాలో చయ్యా చయ్యా పాటలో నటించడం ద్వారా మొదటి సారి ఐటం తో మలైకా అరోరా అలరించింది. బాలీవుడ్ తో పాటు సౌత్ లో కూడా ఎన్నో ఐటం సాంగ్స్ ను చేసిన మలైకా అరోరా ఈ మధ్య కాలంలో సినిమాల్లో పెద్దగా కనిపించడం లేదు. నటిగా ఇప్పటికీ కూడా ఆమె కోరుకుంటే, నటించాలి అనుకుంటే ఏడాదికి మూడు నాలుగు సినిమాల్లో ఆఫర్లు వస్తాయి. కానీ ఆమె మాత్రం నటన పై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. సోషల్ మీడియాలో మాత్రం తన అందమైన ఫోటోలను రెగ్యులర్ గా షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తోంది. అయిదు పదుల వయసు లో కూడా పాతిక సంవత్సరాల ప్రాయం తో అందంగా కనిపిస్తున్న ఈ అమ్మడు నెటిజన్స్ ను ఎప్పటికప్పుడు సర్‌ప్రైజ్ చేస్తూనే ఉంటుంది.

ఇన్‌స్టాగ్రామ్ లో దాదాపుగా 19 మిలియన్‌ల ఫాలోవర్స్ ను కలిగి ఉన్న మలైకా అరోరా తాజాగా షేర్ చేసిన ఈ ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. వైట్ టాప్ అండ్ షార్ట్ లో మలైకా ను చూస్తూ ఉంటే ఈమెకు 50 ఏళ్లు ఎలా అంటున్నారు. మూడు పదుల వయసులో హీరోయిన్స్ చాలా మంది వయసు అయిపోయిన మాదిరిగా కనిపిస్తారు. కానీ మలైకా అరోరా మాత్రం చాలా అందంగా ఇంకా పాతికేళ్ల పడుచు అమ్మాయిగా కనిపిస్తుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ స్థాయి అందం మరే సీనియర్ హీరోయిన్స్ కి సాధ్యం కాదు అనే అభిప్రాయం ను కొందరు వ్యక్తం చేస్తున్నారు.



## మోనాలిసాకు అయినా మతి చెడేలా

అవును.. మోనాలిసా అంతటి అందగత్తెకు అయినా మతి చెడటం ఖాయం. అంతందంగా కనిపిస్తోంది ఈ ఫోటోగ్రాఫ్. ఇందులో ఉన్న ముద్దుగుమ్మ మరెవరో కాదు.. ది గ్రేట్ దిశా పటానీ. సోషల్ మీడియాల్లో వైరల్ గా షేర్ అవుతున్న దిశా లేటెస్ట్ ఫోటోషూట్ ఇతర ఫోటోషూట్ల కంటే సంథింగ్ స్పెషల్ గా ఆకర్షిస్తోంది. ఒక బికినీపై ఉల్లి పొరలాంటి డ్రెస్ ధరించిన దిశా పటానీ సమ్మోహన రూపానికి ఫిదా కాని వారు లేనే లేరు. ప్రస్తుతం ఈ అందమైన ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ లో అగ్గి రాజేస్తోంది. దిశా వాస్తవానికి మోనాలిసాను తలపిస్తోంది! అంటూ అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రఖ్యాత చిత్రకారుడు లియోనార్డో డావిన్సీ మోనాలిసా చిత్తరువును పెయింటింగ్ చేసారు. ఈ పెయింటింగ్ ఒక అందమైన ఆడబొమ్మ. అదే అందం.. మోము.. ముక్కు తీరు.. అవే కళ్లు! అంటూ ఇప్పుడు దిశా పటానీ ఫోటోగ్రాఫ్ ని వీక్షించిన అభిమానులు కవితలు అల్లుతున్నారు.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986